ONE FAMILY, ONE VISION, ONE MISSION
THE SINGARENI COLLIERIES COMPANY LIMITED
SCCL

# సింగరేణీయుల సమాచారం

సంచిక 2/09 ఒకే కుటుంబం - ఒకే లక్ష్యం - ఒకే గమ్యం... - ఇదే సింగరేణి స్ఫూర్తి సంపుటి 45



## ఉన్నత లక్ష్యాల సాధనకు ఉత్తమ సాంప్రదాయాలను కొనసాగిద్దాం !!!










- దేశ సేవలో 445 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి (2008-09)
- 107 శాతంతో లక్ష్యాల సాధన
- గత ఏడాదిపై 9.7 శాతం వృద్ధి
- 2009-10సం॥కి 504 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యం
- అత్యుత్తమ ప్రమాణాలకు శ్రీకారం



చైర్మన్ లేఖ

# లక్ష్యాల సాధనలో సింగరేణి ప్రత్యేకతను చూపుదాం



**ప్రియమైన సింగరేణీయులకు ...**

మన సింగరేణి సంస్థ తన 120 సంవత్సరాల సుదీర్ఘ చరిత్రలో అనేక ఉత్పత్తి లక్ష్యాల మైలురాళ్ళను దాటి పురోగమిస్తూ ఈ ఏడాది (ఈ ఆర్థిక సంవత్సరంలో) 50 మిలియను టన్నుల లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. దీనిలో ముఖ్యంగా భూగర్భ గనుల ఉత్పత్తి లక్ష్యం 15.36 మిలియన్ టన్నులుగా నిర్దేశించడం జరిగింది. తద్వారా నష్టాలలో ఉన్న భూగర్భగనులను బయటికి తీసుకురావాలని భావిస్తున్నాం.

ఈ 50.4 మిలియన్ టన్నుల లక్ష్యం నిర్ధారించుకోవడం వెనుక ఏదో రికార్డు సృష్టిద్దామన్న ఆలోచన లేదు. బొగ్గు కోసం ఎదురుచూస్తున్న విద్యుత్ ఉత్పాదన కంపెనీలు, సిమెంటు, స్పాంజ్ఐరన్ మరియు ఇతర అనేక పరిశ్రమల అవసరాలు తీర్చడానికి, తద్వారా దేశప్రగతికి సాధ్యమైనంత మేర తోడ్పడాలన్నదే మన ప్రధాన సంకల్పం. గత 3 ఏళ్ళ కాలంగా మన అభివృద్ధి రేటును గమనిస్తే ఈ ఏడాది ఉత్పత్తి లక్ష్యం ఏమంత కష్టం కాదని, సింగరేణీయులు తలచుకొంటే ఇటువంటి సవాళ్ళను అధిగమించగలరనీ నాకు నమ్మకముంది.

ఇక్కడ మరో ముఖ్యమైన విషయం గుర్తు చేస్తున్నాను.

లక్ష్యాల సాధనలో మనం గత 7 ఏళ్ళుగా విజయం సాధిస్తూ వస్తున్నాం. కానీ రక్షణవిషయంలో మాత్రం ఇంకా శ్రద్ధ వహించాల్సి ఉంది. ముఖ్యంగా ఈ ఏడాదిలో రూఫ్‌ఫాల్ వంటి ప్రాణాంతక ప్రమాదాలు జరగటం ఎంతో విచారకరం. ఇటువంటివి ఇక ఎట్టి పరిస్థితులలోను తిరిగి జరగడానికి వీలు లేదు. ఎందుకంటే రక్షణలేకుండా ఎంతటి ఉత్పత్తి లక్ష్యాలు సాధించినా అది మనకు కీర్తిని ఇవ్వదు. మీరు పనిచేసే ప్రదేశాలలో రక్షణవిషయంలో మీయొక్క సలహాలు మరియు సూచనలు నిర్భయంగా తెలియజేసినచో, తగిన చర్యలు తీసుకొనడానికి అవకాశము ఉంటుంది.

కనుక ఈ ఏడాది ఉత్పత్తి లక్ష్య సాధనలో ఇకపై ప్రతి ఒక్కరూ రక్షణ, శిక్షణ, క్రమశిక్షణతో పనిచేయడానికి కంకణబద్ధులై ముందుకు పోవాలని, విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నాను.

**జై సింగరేణి, జైహింద్**

ఎస్. నర్సింగ్‌రావు
చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్



కొత్తగూడెంలో మే 12, 2008న జరిగిన జి.ఎం.ల సమీక్షా సమావేశంలో ఎస్టేట్స్ మాన్యువల్‌ను విడుదలచేస్తున్న దృశ్యం.



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏరియాలవారిగా సమీక్ష నిర్వహిస్తున్న మన చైర్మన్ & ఎం.డి. మరియు ఉన్నతాధికారులు (27.01.2009)

# సింగరేణీయుల సమాచారం

ఎడిటోరియల్

సంచిక : 2/2009 సంపుటి : 46


## సమిష్టి కృషితోనే సత్ఫలితాలు సాధ్యం

ఒక టీమ్‌గా రూపొంది పని చేయడం నేడు చాలా అవసరం. తమకు తెలియక ఎవరో చెప్తేనే చేసేవారు కొందరైతే, తమకు తెలిసినా ఎవరైనా చెప్తేనే చేసేవారు మరికొందరు. ఇలాకాక తమకు అవగాహనలేకున్నా పని చేయాలనే తపనతో చేసేవారు మరికొందరు. ఇలా వివిధరకాల వ్యక్తులు తమని, తమలోని పని నైపుణ్యాన్ని వినియోగించేవారు మనకు కనిపిస్తుంటారు. ఒక వ్యక్తిలోని పని నైపుణ్యత, సృజనాత్మకత వెలికి రావాలంటే కావలసిన ప్రోత్సాహం అన్నివిధాలుగా ఇవ్వాలి (వనరులు, సలహాలు, నమ్మకం మొ॥నవి). అలా కాక అన్నీ నేనే, నేను చెప్పినట్లు ఎదుటివారు వినాలి, చేయాలి అనే పద్ధతి, మంచి దీర్ఘకాలిక ఫలితాలను ఇవ్వదు. ఇలాంటి విధానం ఆ వ్యక్తి ఆ పనిలో ఉన్నంతకాలం లేదా సంస్థలో ఉన్నంతకాలం నడుస్తుంది. అతనితోనే అది ముగిసిపోతుంది. అందుకే అందరితో కలిసిపోవడం, తన ఆలోచనలను ఇతరులతో పంచుకుని కలిసి పని చేయడం వలన జ్ఞాన పరిధి పెరిగి సంస్థకు దీర్ఘకాలిక, శాశ్వత ప్రయోజనం ఉంటుంది.

కేవలం ఒక వ్యక్తి అనగా సంస్థలో పనిచేసే అధికారి కావచ్చు, లేదా సూపర్‌వైజర్, ఉద్యోగి కావచ్చు. తన ఆలోచనా విధానాన్ని, పనిచేసే విధానాన్ని అందరు ఆచరించి ఆమోదించాలని అనుకోవటం కూడా సరికాదు. మనం చేస్తున్న పనికి మంచి ఫలితం రావాలంటే సమిష్టి ఆలోచన, సమిష్టి ఆమోదం, సమిష్టి కృషి చాల అవసరం.

దీనికి వ్యక్తుల మధ్య పరస్పర ఆమోదయోగ్యమైన అవగాహనా వాతావరణంతో పాటు పరస్పర ప్రోత్సాహక అనుబంధం కూడా చాలా అవసరం. దీనివలన ఒక టీమ్‌గా పని చేసే పరిస్థితులు అభివృద్ధి చెందుతాయి.

అంతేకాకుండా తనలో నిక్షిప్తమైవున్న నైపుణ్యాన్ని తనకితానుగా ప్రోత్సహించుకునే గుణాన్ని కూడా ప్రతి ఒక్కరూ పెంపొందించుకోవాలి. ఫలితంగా వ్యక్తిగత ఉత్పాదకతా సామర్థ్యం మెరుగై మంచి రాబడులను సాధించవచ్చు.

ఎస్. చంద్రశేఖర్, సి.పి.ఆర్.ఓ.
ఎడిటర్-ఇన్-చీఫ్

## లో.ప.లి.పే.జీ.ల్లో


**'సాధించాల్సింది ఇంకా ఉంది' - శ్రీ ఐ.వి.ఎన్. ప్రసాదరావు, డైరెక్టర్, (ఇ.&ఎం.)** — 2
యంత్రసామర్థ్య వినియోగం, విద్యుత్ పొదుపు మొదలైన అంశాలపై మన డైరెక్టర్ (ఇ & ఎం) తో ప్రత్యేక ఇంటర్వ్యూ

**మన విజయం - ఘన విజయం** — 3
2008-09 సం॥లో లక్ష్యాలకుమించి సాధించిన బొగ్గు ఉత్పత్తి, రవాణా గురించి, అత్యుత్తమ ఏరియాలు, గనుల వివరాలతో విశ్లేషణ

**స్ఫూర్తిదాయకం** — 4
జాతీయస్థాయిలో సింగరేణి రెస్క్యూ టీంకు ద్వితీయస్థానం, దిగిపోయిన కార్మికుల పెన్షన్ సమస్యలపై సదస్సు, స్వర్ణలతకు ఉత్తమ నర్సు-2008 అవార్డు

**కార్మికశ్రేణి** — 5
గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాల నాయకుల చైనా పర్యటన, సింగరేణీయుల సమాచారంకు జాతీయస్థాయిలో ఉత్తమ న్యూస్‌లెటర్ అవార్డు

**స్వయం సమృద్ధి** — 6
సెక్యూరిటీ శాఖను బలోపేతం చేసే దిశగా చర్యలు-419 గార్డుల నియామకం

**సమీప గ్రామాల సేవలో** — 7
అటవీగ్రామం బుగ్గలో వైద్యసేవలు-రామగుండం పరిధిలో మెగా మెడికల్ క్యాంప్, మందమర్రి ఏరియాలో 1500 మంది గిరిజనులకు రగ్గులు, దుప్పట్లు పంపిణీ.

**రక్షణ చైతన్యం** — 8
గతంలో జరిగిన కొన్ని ప్రమాదాలు, విశ్లేషణ, గుణపాఠాలు

**సింగరేణి మహిళ** — 9
ప్లాస్టిక్ బ్యాగ్‌లను వద్దని, పేపర్ బ్యాగ్‌ల తయారీకి స్వాగతం పలికిన రామగుండం-2 మహిళలు – సింగరేణి అంతటా ఘనంగా జరిగిన మహిళాదినోత్సవం –దురలవాట్లపై మహిళా ప్రదర్శనలు

**ఘనంగా జరిగిన సింగరేణి డే, రిపబ్లిక్ డే ఉత్సవాల ఫోటో ఫీచర్ (సెంటర్‌స్ప్రెడ్‌లో)** — 10
సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాలలో జరిగిన సింగరేణి దినోత్సవం, గణతంత్ర వేడుకల చిత్రాలు

**సేవా సమితి కార్యక్రమాలు** — 12
2008-09లో సేవా సమితి ద్వారా చేపట్టిన అనేక కార్యక్రమాలపై ప్రత్యేక వార్త

**తెలుసుకుందాం** — 14
కోల్ ఇండియా కంపెనీల పేర్లేమిటి? అవి ఎక్కడున్నాయి? అనే విషయాలపై ప్రత్యేక వార్త

**ఏరియాల విశేషాలు** — 15
ఓసి గనుల క్యాంటిన్‌లో వెజిటబుల్ బిర్యాని, వికలాంగుల క్రీడాపోటీలు, వార్తా చిత్రాలు

**క్రీడారంగం** — 16
విజయవంతంగా జరిగిన 23వ కోల్ ఇండియా ఇంటర్ కంపెనీ లాన్ టెన్నిస్ పోటీల విశేషాలు

**రక్షణ వారోత్సవాలు** — 17
43వ రక్షణ వారోత్సవాల బహుమతి ప్రధానోత్సవం-విజేతల వివరాలు

**భూభ్రమణం** — 18
జాతీయ అంతర్జాతీయ బొగ్గు పరిశ్రమ విశేషాల సమాహారం

**లేఖలు - కవితలు (19), జ్ఞాపకాల పొరలు (20)**



ఎడిటర్-ఇన్-చీఫ్ — **ఎస్. చంద్రశేఖర్,** Chief Public Relations Officer
ఎడిటర్ — **గణాశంకర్ పూజారి,** Communication Co-ordinating Officer
అసోసియేట్ ఎడిటర్స్ — **డి.వి. సుబ్బారావు,** Public Relations Assistant, **శ్రీమతి జె. సావిత్రి,** Spl. Gr. Clerk

ఈ పత్రికను మన వెబ్‌సైట్‌లో కూడా చూడవచ్చు : **www.scclmines.com**
ఈ పత్రికపై మీ అభిప్రాయాలను మాకు మెయిల్ చేయండి : **E-mail: sccl.samacharam@scclmines.com**



శ్రీ ఐ.వి.ఎన్. ప్రసాదరావు, డైరెక్టర్ (ఇ అండ్ ఎమ్)

# "సంస్థ పురోభివృద్ధిలోవున్నా ఇంకా సాధించాల్సింది ఎంతో ఉంది"

**ప్ర. గత 10 ఏళ్ళ కాలంలో మన కంపెనీలో యంత్ర వినియోగ శాతం పెరుగుతూ వస్తోంది కదా. దీనిపై మీ పరిశీలన ఏమిటి?**

జ. గత పదేళ్ళ కాలంలో మన సంస్థలో ఎక్కువగా ఓపెన్‌కాస్ట్ గనులను ప్రారంభించడం జరిగింది. కొత్తగూడెం రీజియన్‌లోని సత్తుపల్లిలో జెవీఆర్ ఓసీ-1, జెవీఆర్ ఓసీ-2, రామగుండం రీజియన్‌లో ఆర్జీ ఓసీ-1 విస్తరణ, ఆర్జీ ఓసి-2 విస్తరణ, మేడిపల్లి ఓసీ, అలాగే బెల్లంపల్లి రీజియన్‌లో ఖైరగురా ఓపెన్‌కాస్ట్, డోర్లీ ఓసీ, శ్రీరాంపూర్ ఓసీ-1 గనులను ప్రారంభించడం జరిగింది. అందువల్ల ఓపెన్‌కాస్టులలో ఉపయోగించే భారీ యంత్రాలు (హెవీ ఎర్త్ మూవింగ్ మెషినరీ) సమకూర్చుకోవడం జరిగింది.

ఈ భారీ యంత్రాల మీద నైపుణ్యత పెరగడంతో, వినియోగ శాతం కూడా పెరిగి ఉత్పాదకత పెరిగి మన సంస్థ లాభాల బాటలో నడుస్తోంది.

ఓపెన్‌కాస్టులలో ఉపయోగించే భారీ యంత్రాలు, భూగర్భ గనుల్లో ఉపయోగించే యంత్రాల ఉత్పాదకత పెరుగుదల మీదే మన సంస్థ మనుగడ ఆధారపడి ఉంది. ఈ యంత్రాల వినియోగ శాతం పెరగడమనేది మన సంస్థ భవిష్యత్తుకు ఒక మంచి సూచన.

**ప్ర. సి.ఎమ్.పి.డి.ఐ.ఎల్. నార్మ్స్ లేదా కోల్ ఇండియా స్థాయిలో యంత్ర సామర్థ్యం ఉండాలని 5 ఏళ్ళ క్రితం అంటుండే వాళ్ళం. ఇప్పుడు మన సామర్థ్యం ఎలా ఉంది?**

జ. ఇప్పుడు మన సామర్థ్యం సి.ఎమ్.పి.డి.ఐ.ఎల్. నార్మ్స్ కన్నా ఎక్కువగా ఉన్నది. ఉదాహరణకు షవల్ అవైలబిలిటీ సి.ఎమ్.పి.డి.ఐ.ఎల్. నార్మ్స్ ప్రకారం 80 శాతం ఉంటే సింగరేణిలో 82 శాతం ఉన్నది. అలాగే డంపర్స్ విషయంలో సి.ఎమ్.పి.డి.ఐ.ఎల్. నార్మ్స్ ప్రకారం 68 శాతం ఉంటే సింగరేణిలో 73 శాతం సాధించాము. అలాగే డ్రిల్స్ విషయంలో సి.ఎమ్.పి.డి.ఐ.ఎల్. నార్మ్స్ ప్రకారం 77 శాతం ఉంటే మన సంస్థలో 79-80 శాతం దాకా సాధిస్తున్నాము.

**ప్ర. హెచ్.ఇ.ఎమ్.ఎమ్. సామర్థ్యం పెరిగితే ఉత్పత్తిపై చూపే ప్రభావం ఎలా ఉంటుంది?**

జ. హెచ్.ఇ.ఎమ్.ఎమ్. సామర్థ్యం పెరగడం వల్ల మన సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకత పెరిగి కంపెనీ లాభాల బాటలో నడుస్తుంది. ఈ వచ్చిన లాభాలతో ఇంకా కొత్తగనులు ప్రారంభించుకోవడానికి మరియు కొత్త యంత్ర సామాగ్రి సమకూర్చు కోవడానికి వీలుపడుతుంది.

**ప్ర. ప్రస్తుత మన పని సామర్థ్యం ఎలా ఉండాలని మీరు కోరుతున్నారు? సూచనలు ఏమిటి?**

జ. మనం సాధించినది పురోభివృద్ధిలో ఉన్నా, ఇంకా ఎంతో సాధించాల్సి ఉన్నది. ముఖ్యంగా భూగర్భ గనుల్లో మన ఉత్పత్తి, ఉత్పాదకత చాలా పెరగాల్సి ఉన్నది. దీనికి కావలసినదల్లా ప్రతి ఉద్యోగి ఈ సంస్థ నాది అన్న భావనతో పని చేయాలి. **ప్రతి ఉద్యోగి తన సామర్థ్యంలో నూటికి నూరు శాతం కంపెనీకి ఉపయోగించాల్సి ఉన్నది. క్రమశిక్షణతో, అంకితభావంతో కష్టపడి పనిచేస్తే మన సింగరేణి సాధించలేనిదంటూ ఏమీ ఉండదు.** ఈ విషయంలో మన సి.ఎమ్.డి. గారు చెప్పినట్లు "నేను మేమై అన్నీ తామై సాధిద్దాం" అన్న స్లోగన్ గుర్తుంచుకోవాలి.

**ప్ర. సింగరేణిలో యాంత్రీకరణకు సంబంధించిన వివరాలు చెప్పండి.**

జ. సింగరేణి లోని భూగర్భ గనుల్లో కార్మికుల శారీరక శ్రమను తగ్గించడం కొరకు యాంత్రీకరణ జరుగుతోంది. ఇందుకోసం సుమారు 113 సైడ్ డంప్ లోడర్లు, (SDL) 40 లోడ్ హాల్ డంపర్లు (LHD) ప్రవేశ పెట్టడం జరిగింది. ఇక లాంగ్ వాల్ టెక్నాలజీ వినియోగంలో సింగరేణి ఇంతకు ముందే రికార్డు ప్రొడక్షన్ సాధించింది. ఈ టెక్నాలజీ అత్యంత రక్షణతో కూడినది మరియు అధిక ఉత్పత్తి సాధించేది. మనము ఇప్పటికే 4-5 గనుల్లో లాంగ్‌వాల్ టెక్నాలజీ ప్రవేశపెట్టడానికై ప్రణాళికలు సిద్ధం చేశాము. ప్రస్తుతం అడ్రియాల, శాంతిఖని మరియు కాకతీయ గనుల్లో లాంగ్‌వాల్ టెక్నాలజీ వినియోగించడం కోసం టెండర్లు ప్రాసెస్ చేస్తున్నాం. ఇందులో ముఖ్యంగా అడ్రియాల లాంగ్‌వాల్ ఏటా 3 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసే సామర్థ్యం కలిగి ఉంటుంది. (దాదాపు ఒక ఓపెన్ కాస్ట్ గని ఉత్పత్తికి సమానం)

**ప్ర. హైవాల్ మైనింగ్ టెక్నాలజీ వస్తుందన్నారు - ఇది ఏ స్థాయిలో ఉన్నది?**

జ. హైవాల్ మైనింగ్ టెక్నాలజీ ప్రవేశ పెట్టడానికి ఇప్పటికే ఆర్డర్లు వేశాము. ప్రస్తుతం సప్లయర్ యంత్రాలను దిగుమతి చేసుకుంటున్నారు. హై వాల్ విధానం అక్టోబర్ లేదా నవంబర్ నెలలలో ప్రారంభం కావచ్చు.

**ప్ర. భూగర్భ గనుల్లో ఉత్పత్తి పెంచుతూ ఈ ఏడాది లక్ష్యాలు నిర్దేశించబడినాయి కదా! దీనికి మనం తీసుకుంటున్న చర్యలు ఏమిటి?**

జ. ఈ ఏడాది భూగర్భ గనుల నుండి 15.36 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా ఎంచుకొన్నాము. ఉత్పత్తి, ఉత్పాదకత పెంచుకోవడానికి ఇంతకు ముందు చెప్పినట్లు సైడ్ డంప్ లోడర్లు, లోడ్ హాల్ డంపర్ల వినియోగాన్ని పెంచుతున్నాము. ఇది సాధించడానికి యంత్రాలు బ్రేక్ డౌన్స్ లేకుండా ఉండేలా మెయింటెనెన్స్ కార్యక్రమాలు, సరియైన సమయంలో భారీయంత్రాల స్పేర్స్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాము. అలాగే రేట్ కాంట్రాక్ట్స్, డిపో అగ్రిమెంట్లు లాంటి చర్యలు తీసుకోవడం జరుగుతోంది. అలాగే వీలున్నచోట మెయింటెనెన్స్ క్రూలు, సపోర్టింగ్ గ్యాంగ్ మొదలైన పనులను స్టాగరింగ్ అయ్యేలా ముందుగానే చర్యలు తీసుకుంటున్నాము.

**ప్ర. అత్యాధునిక కోల్ గ్యాసిఫికేషన్ వంటి టెక్నాలజీలు మనవద్ద ఎక్కడ చేపట్టబోతున్నారు?**

జ. కోల్ గ్యాసిఫికేషన్ టెక్నాలజీలు మణుగూరు ఏరియాలో చేపట్టడానికై ప్రయత్నాలు జరుగుతున్నాయి.

**ప్ర. విద్యుత్ వాడకంలో మనం పాటిస్తున్న పొదుపుతో తృప్తి చెందుతున్నారా? ఇంకా చెయ్యాల్సిన అవసరం ఉన్నదా?**

జ. విద్యుత్ వాడకంలో మనం పాటిస్తున్న పొదుపు చాలా మంచి ఫలితాలను ఇస్తుంది. 5 ఏళ్ళ క్రితం టన్నుకు 25 యూనిట్లు ఉన్న విద్యుత్ వాడకం ప్రస్తుతం 14 యూనిట్లకు తగ్గింది. భూగర్భగనుల్లో విద్యుత్ వినియోగం తగ్గించడానికి ఇంకా అవకాశమున్నది. ఈ విషయంలో పంపింగ్ లే అవుట్, హాలేజి లే అవుట్ మొదలైన విషయాలను రెవ్యూ చేయడం జరుగుతుంది.

అలాగే ఇళ్ళలో, కాలనీలలో ఇంకా విద్యుత్ పొదుపు చేయవల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. సింగరేణీయులలో విద్యుత్ వినియోగం పట్ల మరింత చైతన్యం తేవడానికై "సేవా" సభ్యుల సహకారంతో కాలనీలలో అవగాహనా సదస్సులు ఏర్పాటు చేయడం జరుగుతోంది.

# అనేక కొత్త రికార్డులతో లక్ష్యాన్ని మించి బొగ్గు ఉత్పత్తి, సరఫరా

**2008-09 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి, సరఫరా లక్ష్యాలను మన సంస్థ సాధించింది. ఇందుకు అహర్నిశలు కృషి చేసిన కార్మికులకు, సూపర్‌వైజర్ సిబ్బందికి, అధికారులకు, కార్మిక సంఘాల వారికి మన ఛైర్మన్ అండ్ ఎం.డి. మరియు డైరెక్టర్లు తమ శుభాకాంక్షలను తెలియజేశారు. ఇందుకు సహకరించిన ప్రభుత్వ, రైల్వే అధికారులకు కృతజ్ఞతలను తెలిపారు. ఈ ఏడాది మనం సాధించిన ఉత్పత్తిలో అనేక కొత్త రికార్డులు కూడా ఉన్నాయి.**

2008-09 సం॥రానికి కంపెని నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యం 41.50 మిలియన్ టన్నులకు గాను 44.54 మిలియన్ టన్నులను (107%) సాధించింది. 37 అండర్ గ్రౌండ్ గనులకు గాను 18 గనులు తమ లక్ష్యాలను సాధించగా, అన్ని ఓపెన్‌కాస్ట్ గనులు తమ లక్ష్యాలను సాధించాయి.

డిపార్ట్‌మెంటల్‌గా ఓబి తీయడంలో 20% వృద్ధిని సాధించడం ఈ సంవత్సరపు విశేషం.

అలాగే బొగ్గు సరఫరాలోకూడా ఈ సం॥ సరికొత్త రికార్డు నమోదు అయింది. రికార్డుస్థాయిలో 44.40 మిలియన్ టన్నులు సరఫరా చేయగా అందులో 72% కేవలం విద్యుత్ ఉత్పత్తి రంగానికే సరఫరా జరిగింది.

సుస్థిరమైన పారిశ్రామిక శాంతి, రక్షణపై నిరంతర దృష్టి, అందరి సహకారం వల్లనే ఇది సాధ్యమైందని, రాబోయే రోజులలో కూడా పారిశ్రామిక శాంతి, రక్షణతోపాటు, సింగరేణి పరిసరాల సమగ్ర అభివృద్ధియే లక్ష్యంగా పనిచేస్తూ 2009-10 సం॥కి నిర్దేశించిన 50.4 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని సాధించడానికి అందరూ కృషి చేయాలని సింగరేణి ఆశిస్తోంది.



## కొన్ని హైలైట్స్

**నూరు శాతం పైగా ఉత్పత్తి లక్ష్యాలు సాధించిన ఏరియాలు వరుస క్రమంలో**

**కొత్తగూడెం : 118 శాతం**
**ఇల్లందు : 110 శాతం**
**మణుగూరు : 106 శాతం**

**లక్ష్యాల సాధనలో అత్యుత్తమ గనులు**

### ఓపెన్ కాస్ట్ గనులు (ఉత్పత్తి లక్షల టన్నులలో)

| | లక్ష్యం | సాధించినది | శాతం |
|---|---|---|---|
| ప్రథమస్థానం<br>జె.వి.ఆర్. ఓ.సి. -<br>(కొత్తగూడెం ఏరియా) | 20.00 | 26.79 | 134 |
| ద్వితీయ స్థానం<br>పి.కె. ఓ.సి.-4 :<br>(మణుగూరు ఏరియా) | 25.00 | 32.9 | 132 |

డిపార్టుమెంటల్ ఓబిలో ఉత్తమ ఓ.సి. గని : ఆర్.జి. ఓ.సి.-1 (రామగుండం-3 ఏరియా)

### భూగర్భగనులు (ఉత్పత్తి లక్షల టన్నులలో)

| | లక్ష్యం | సాధించినది | శాతం |
|---|---|---|---|
| ప్రథమస్థానం<br>కె.కె.-1<br>మందమర్రి ఏరియా | 1.68 | 2.45 | 146 |
| ద్వితీయ స్థానం<br>ఆర్.కె.-1ఎ<br>మందమర్రి ఏరియా | 2.40 | 3.26 | 136 |

### ఎస్.డి.ఎల్స్ గనులు

| | | | |
|---|---|---|---|
| ప్రథమస్థానం<br>కె.కె.-1 - (మందమర్రి) | 1.68 | 2.45 | 146 |
| ద్వితీయ స్థానం<br>ఆర్.కె.-5 - (శ్రీరాంపూర్) | 1.68 | 2.34 | 139 |

### ఎల్.హెచ్.డి గనులు

| | | | |
|---|---|---|---|
| ప్రథమస్థానం (811 విభాగం)<br>వి.కె.-7 - (కొత్తగూడెం) | 1.40 | 2.90 | 207 |
| ప్రథమస్థానం (912 విభాగం)<br>జి.డి.కె.-11ఎ<br>(రామగుండం - 1) | 2.50 | 2.50 | 100 |

### హేండ్ సెక్షన్ మైన్


| | లక్ష్యం | సాధించినది | శాతం |
|---|---|---|---|
| ప్రథమస్థానం<br>జి.డి.కె. - 1 & 3<br>రామగుండం -1 | 1.60 | 2.98 | 186 |
| ద్వితీయ స్థానం<br>ఆర్.కె.- 8<br>శ్రీరాంపూర్ | 40,000 | 57,348 | 143 |

### బ్లాస్టింగ్ గ్యాలరీ

| | | | |
|---|---|---|---|
| ప్రథమస్థానం<br>జి.డి.కె.-10<br>(రామగుండం-3) | 3.30 | 3.62 | 110 |

### లాంగ్‌వాల్

| | | | |
|---|---|---|---|
| ప్రథమస్థానం<br>వకీలుపల్లి గని<br>(రామగుండం-2) | 3.00 | 3.43 | 114 |




ఉత్పాదకత పెంపుదలపై రామగుండంలో జరిగిన సదస్సులో సావనీర్ విడుదల చేస్తున్న మన సంస్థ ఛైర్మన్ మరియు డైరెక్టర్లు



## జాతీయస్థాయిలో సింగరేణి రెస్క్యూ టీం - బి కి ద్వితీయస్థానం

జాతీయస్థాయిలో నిర్వహించిన 39వ ఆలిండియా రెస్క్యూ పోటీల్లో సింగరేణి నుంచి వెళ్లిన టీం-బి కి ఓవరాల్ ద్వితీయస్థానం లభించింది. ఫిబ్రవరి 27, 28, మార్చి 1వ తేదీల్లో నాగపూర్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా గల బొగ్గు సంస్థల జట్లు (15) పాల్గొన్నాయి. సింగరేణి నుంచే వెళ్లిన మరో జట్టు (టీం-ఎ) 3వ స్థానాన్ని దక్కించుకొంది. సందర్భంగా మార్చి 1వ తేదిన మైన్స్ రెస్క్యూ స్టేషన్‌లో జరిగిన అభినందన సభలో పలువురు ఏరియా ఉన్నతాధికారులు పాల్గొని జట్టు సభ్యులను అభినందించారు. గతంలో కూడా అనేకసార్లు మన సింగరేణి రెస్క్యూ టీములు ఉత్తమ బహుమతులను గెలుచుకొన సంగతి మీకు విదితమే.

## శ్రీమతి స్వర్ణలత, స్టాఫ్ నర్స్‌కు కేశవరావు మెమోరియల్ "ఉత్తమ నర్స్ - 2008" అవార్డు

సింగరేణి కాలరీస్ హాస్పిటల్‌లో దాదాపు 80 సంవత్సరాల క్రితం డాక్టర్‌గా పనిచేసి 1951లో స్వర్గస్థులైన డాక్టర్ బి.ఎస్.కేశవరావుగారి జ్ఞాపకార్థం అతని మనుమడు, మాజీ సింగరేణి ఉద్యోగి, ప్రస్తుతం ఆస్ట్రేలియాలో స్థిరపడ్డ శ్రీ బి.జె.శ్రీనాధ్ ఒక ట్రస్టును ఏర్పాటు చేసి సింగరేణి హాస్పిటల్స్‌లో ఉత్తమ నర్సుగా ఎంపికయిన వారికి ప్రతి ఏటా పదివేల రూపాయల నగదు ప్రదానం చేసేందుకై శ్రీకారం చుట్టారు.



ఈ అవార్డుకు మొట్టమొదటిసారిగా ఎంపికయిన శ్రీమతి స్వర్ణలత 1973లో కొత్తగూడెంలో జన్మించారు. కొత్తగూడెంలోని సింగరేణి బాలికోన్నత పాఠశాలలో పదవ తరగతి, సింగరేణి మహిళాకళాశాలలో ఇంటర్మీడియట్, సింగరేణి నర్సింగ్ స్కూల్ నుండి జనరల్ నర్సింగ్, మిడ్ వైఫరీలో డిప్లమో చేశారు. 1993 సెప్టెంబర్ నుండి సింగరేణిలో విధులు నిర్వహిస్తున్నారు. సింగరేణి మెయిన్ హాస్పిటల్ ఆవరణలో జనవరి 27, 2009న జరిగిన ఒక కార్యక్రమంలో సంస్థ సి అండ్ ఎమ్.డి. శ్రీ ఎస్.నర్సింగ్‌రావు గారు, శ్రీమతి స్వర్ణలతకు డాక్టర్ బి.ఎన్.కేశవరావు మెమోరియల్ అవార్డు క్రింద రూ.10,000/- చెక్కును ప్రదానం చేశారు.


ఈ సందర్భంగా సి.ఎమ్.డి. మాట్లాడుతూ ఈవిధంగా ఒక ట్రస్ట్ ఏర్పాటును చేసి నగదు బహుమతి ఇచ్చి నర్సులలోని ప్రతిభను వెలికి తీయడమేకాకుండా ఇతరులకు స్ఫూర్తిదాయకంగా ఉండేలా ఇలాంటి బృహత్తర కార్యక్రమం చేపట్టినందులకు శ్రీనాధ్‌ను వారి కుటుంబ సభ్యులను అభినందించారు. మొట్టమొదటిసారిగా సింగరేణిలో "ఉత్తమ నర్స్-2008" అవార్డు అందుకున్నందులకు శ్రీమతి స్వర్ణలతను అభినందిస్తూ ఆమెను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.

మన హాస్పిటల్స్ సుమారు 72 వేలమంది ఉద్యోగులకు వారి కుటుంబ సభ్యులకు ఉత్తమ సేవలు అందిస్తున్నాయని, ఎంత ఖర్చు అయినా ఎలాంటి గరిష్ట పరిమితి లేకుండా సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందించడానికి ఏ మాత్రం వెనుకాడడం లేదని అన్నారు. అధునాతన వైద్య సేవలను దృష్టిలో పెట్టుకొని మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి ఇంకా కృషి చేయాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమానికి చీఫ్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ కె.ముకుందరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఇంకా డైరెక్టర్ (ఆపరేషన్స్) శ్రీ జె.వి. దత్తాత్రేయులు, డైరెక్టర్ (ఫైనాన్స్) శ్రీ ఇ.వి.కృష్ణారెడ్డి, డైరెక్టర్ (పి.పి.) శ్రీ డి.ఎల్.ఆర్.ప్రసాద్, డైరెక్టర్ (పా) శ్రీ ఎల్.శశిధర్., అవార్డు ప్రధాత శ్రీ బి.జె.శ్రీనాధ్ ఇతర అధికారులు, డాక్టర్లు హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## దిగిపోయిన కార్మికుల పెన్షన్ సమస్యలపై శ్రీరాంపూర్‌లో సదస్సు





### సింగరేణి సి.ఎం.పి.ఎఫ్. అధికారుల సమక్షంలో సమస్యల పరిష్కారం

మన కంపెనీ నుంచి పదవీ విరమణ చేసిన కార్మికుల పెన్షన్ రివిజను, ఇతర సమస్యలపై ఒక ప్రత్యేక సదస్సును శ్రీరాంపూర్ ఏరియాలో ఏప్రిల్ 24న నిర్వహించారు. దీనిలో సింగరేణి, సి.ఎం.పి.ఎఫ్. ఉన్నతాధికారులతోపాటు కార్మిక సంఘాల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్ ఏరియాలకు సంబంధించిన సుమారు వెయ్యి మంది రిటైరైన కార్మికులు తమ సమస్యలను గనులవారీగా ఏర్పాటు చేసిన కంప్యూటరైజ్డ్ కౌంటర్లలో విన్నవించారు. 850 కేసులకు పరిష్కారమార్గం వివరించగా, 53 కేసులను అప్పటికప్పుడే పరిష్కరించారు. దిగిపోయిన కార్మికులపట్ల యాజమాన్యం తీసుకొన్న ఈ కార్యక్రమంపై కార్మికులు, వారి కుటుంబసభ్యులు తమ కృతజ్ఞతలను, సంతోషాన్ని వ్యక్తం చేశారు. మన సంస్థనుంచి దిగిపోయిన కార్మికులకు తక్షణ న్యాయం అందించేందుకే ఈ సదస్సు ఏర్పాటులో చొరవ చూపామని మన డైరెక్టర్ (పా) శ్రీ ఎల్.శశిధర్, ఐ.ఎ.ఎస్. వివరించారు. సి.ఎం.పి.ఎఫ్. జాతీయస్థాయి కమీషనర్ శ్రీ భట్టాచార్య, రీజినల్ కమీషనర్ శ్రీ హేమసుందర్‌లు కార్మికుల పెన్షన్ సమస్యలు తక్షణం పరిష్కరిస్తామని సభాముఖంగా హామీ ఇచ్చారు. ఈ సదస్సులో సి.జి.ఎం. (పర్సనల్) శ్రీ ఎం.గంగిరెడ్డి, జి.ఎం. (వెల్ఫేర్) శ్రీ జి.అయిలయ్యతోపాటు శ్రీ ఎం.శేషుకుమార్‌రెడ్డి (సి.జి.ఎం.-శ్రీరాంపూర్), శ్రీ సి.వి.రెడ్డి (జి.ఎం.-బెల్లంపల్లి), శ్రీ ఆంథోనిరాజ (జి.ఎం.-మందమర్రి), గుర్తింపు కార్మిక సంఘం ప్రధానకార్యదర్శి శ్రీ వాసిరెడ్డి సీతారామయ్య, తదితరులు పాల్గొన్నారు.





# సమ్మెలు లేని పని సంస్కృతికి నిలయం - చైనా



పర్యటనలో పాల్గొన్నవారు :- శ్రీ ఎం. గంగిరెడ్డి, సి.జి.ఎం. (పర్సనల్), శ్రీ సి.మల్లయ్య పంతులు, డి.జి.ఎం. (పర్సనల్), గుర్తింపు కార్మిక సంఘం నాయకులు (ఎ.ఐ.టి.యు.సి.) నుంచి శ్రీ వై.గట్టయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్, శ్రీ వి.సీతారామయ్య, జనరల్ సెక్రటరీ, శ్రీ ఎం.రంగయ్య, డిప్యూటీ జనరల్ సెక్రటరీ, శ్రీ డి.శేషయ్య, డిప్యూటీ జనరల్ సెక్రటరీ, ప్రాతినిధ్య సంఘాలైన టి.బి.జి.కె.యస్. నుంచి శ్రీ కె. మల్లయ్య, జనరల్ సెక్రటరీ, శ్రీ ఎం.రాజిరెడ్డి, ఉపాధ్యక్షులు, ఐ.ఎన్.టి.యు.సి. నుంచి శ్రీ బి.వెంకట్రావు, వర్కింగ్ ప్రెసిడెంట్, సి.ఎం.ఓ.ఎ.ఐ. సంఘం నుంచి శ్రీ వై.వి.సుబ్బారెడ్డి (సీనియర్ వైస్ ప్రెసిడెంట్) తదితరులు పాల్గొన్నారు.



బొగ్గు ఉత్పత్తిలో ప్రపంచంలోనే నెంబర్ 1గా ఉంటూ ఆదర్శప్రాయంగా నిలుస్తోంది చైనా దేశం. ఈ నేపథ్యంలో మన సంస్థలోని గుర్తింపు ప్రాతినిధ్య కార్మిక సంఘాలు, అధికార సంఘ ప్రతినిధులతో కూడిన 10 మంది బృందాన్ని ఆ దేశ పర్యటనకు యాజమాన్యం అక్టోబర్ 10న పంపించింది. ఈ బృందానికి శ్రీ ఎం.గంగిరెడ్డి, చీఫ్ జనరల్ మేనేజర్, (పర్సనల్) నాయకత్వం వహించారు. ఎరడోస్ ప్రాంతంలోగల జిన్‌ఫెంగ్, షిన్హువా లాంగ్‌వాల్ గనులను, జింగ్ ఝీ కోల్ మైన్ మెషినరీ గ్రూపు లిమిటెడ్ కర్మాగారాన్ని మన బృందం సందర్శించింది. ఈ సందర్భంగా మన బృందం కార్మికులు, అధికారులతో సంభాషించింది. చైనాలో అధికోత్పత్తికి, భారీయాంత్రీకరణ, ఉత్తమ రక్షణ, క్రమశిక్షణ పద్ధతులు, చక్కని సంక్షేమ పథకాలు, సమ్మెలు లేని పారిశ్రామిక సంబంధాలు దోహదపడుతున్నాయని మన బృందం అవగాహన చేసుకొంది. ఉన్నత లక్ష్యాల సాధనకు చైనా దేశం ఆదర్శప్రాయమని సభ్యులు అభిప్రాయపడ్డారు.

# జి.డి.కె -1 ఇంక్లైన్‌లో ఘనంగా స్వర్ణోత్సవ వేడుకలు




1959లో ప్రారంభమైన గోదావరిఖని-1 ఇంక్లైన్ ఇప్పటికి 50 సంవత్సరములు పూర్తిచేసుకున్న సందర్భంగా గనిలో స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మన ఛైర్మన్ అండ్ ఎం.డి. శ్రీ ఎస్.నర్సింగ్‌రావు గారు ముఖ్యఅతిథిగా విచ్చేసి అభినందనలు తెలిపారు. గనిలో పనిచేసిన సీనియర్ కార్మికులు కూడా దీనిలో పాల్గొన్నారు. రామగుండం-1 చీఫ్ జనరల్ మేనేజర్ శ్రీ ఎ.మనోహర్‌రావు సారథ్యంలో వారం రోజులపాటు విభిన్నమైన రీతిలో స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.



# 'సింగరేణీయుల సమాచారం' పత్రికకు జాతీయస్థాయి 'ఉత్తమ న్యూస్ లెటర్' అవార్డు





మన ప్రజాసంబంధాల శాఖవారు వినూత్నమైన పోకడలతో, ఉద్యోగుల పత్రికగా తీర్చిదిద్దుతున్న సింగరేణీయుల సమాచారంకు కార్మికులనుంచే కాక ఇతరులనుంచి కూడా ప్రశంసలు అందుతున్నాయి.

పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పి.ఆర్.ఎస్.ఐ.) హైదరాబాద్ చాప్టరు వారు దేశవ్యాప్త పరిశ్రమల మ్యాగజైన్లకు వివిధ కేటగిరీలలో నిర్వహించిన పోటీలో మన పత్రికకు 'బెస్ట్ న్యూస్ లెటర్' అవార్డును ప్రకటించారు. ఫిబ్రవరి, 15, 2009న హైదరాబాద్‌లో జరిగిన పదవ ఆంధ్రప్రదేశ్ కాన్ఫరెన్స్‌లో ఈ అవార్డును ప్రముఖ సంపాదకుడు శ్రీ పొత్తూరు వెంకటేశ్వరరావు చేతులమీదగా మన పి.ఆర్.ఒ. శ్రీ ఇ.నర్సింగ్‌రావు, ఎడిటర్ శ్రీ గణాశంకర్ పూజారి అందుకొన్నారు.

ఈ సందర్భంగా పొత్తూరి వెంకటేశ్వరరావు మన పత్రికను పరిశీలించి, పరిశ్రమల మ్యాగజైన్లకు భిన్నంగా వినూత్నంగా ఉందనీ, ఇటువంటి మార్పునే తాము కోరుకొంటున్నామనీ అన్నారు. అలాగే మన సంస్థ నిర్మించిన డాక్యుమెంటరీ ఫిల్మ్ దేశసేవలో సింగరేణికి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. పై పోటీల్లో 30కి పైగా దేశవ్యాప్తంగా గల పరిశ్రమల పత్రికలు పాల్గొన్నాయి. గతంలో కూడా మన పత్రికకు వీడియో చిత్రాలకు జాతీయస్థాయి బహుమతులు వచ్చిన విషయం మీకు తెలిసిందే!

# సెక్యూరిటీ శాఖ బలోపేతం - 419 మంది గార్డుల నియామకం



మన సంస్థ ఆస్తులను కాపాడటంలో, అలాగే శాంతిభద్రతలు, పారిశ్రామిక భద్రత నెలకొల్పడంలో సెక్యూరిటీ సిబ్బంది పాత్ర ప్రముఖమైనది. ఈ విభాగానికి బైటనుంచి సిబ్బందిని తెచ్చుకోవడం కన్నా సంస్థలోనే పనిచేస్తున్న ఉద్యోగులతో పటిష్టమైన సెక్యూరిటీ విభాగాన్ని రూపొందించాలని యాజమాన్యం భావించింది. దీనికనుగుణంగా ఇంటర్నల్ రిక్రూట్‌మెంట్‌కు శ్రీకారం చుట్టింది.

2007 సెప్టెంబర్‌లో అప్పటికే కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగులనుండి సెక్యూరిటీ సిబ్బంది నియామకానికై దరఖాస్తులు ఆహ్వానించింది. దేహధారుఢ్య, వ్రాత మరియు మౌఖిక పరీక్షల ద్వారా ఎంపిక ప్రక్రియ చేపట్టింది. మొత్తం 1585 మంది పరుగుపందెంలో పాల్గొనగా వారిలో 783 మంది విజయం సాధించారు. వీరిలో అర్హులైనవారిని అవసరమైన మేరకు సెక్యూరిటీ సిబ్బందిగా శిక్షణ నిచ్చి నియమించే ప్రక్రియ ప్రారంభించింది.


ఇప్పటివరకు 419 మందికి ఐదు బ్యాచ్‌లలో శిక్షణనిచ్చారు. శిక్షణను విజయ వంతంగా పూర్తిచేసిన వారికి "పాసింగ్ అవుట్ పరేడ్" కార్యక్రమం నిర్వహించారు. ఆరువారాల శిక్షణా కాలంలో అయిదు వారాలు బేసిక్ ట్రైనింగ్, ఒక వారం "ఆన్-ది-జాబ్ ట్రైనింగ్" ఇచ్చారు.

సి.జి.ఎం. సెక్యూరిటీ శ్రీ ఎ. గోపీచంద్ సారధ్యంలో అనుభవజ్ఞులైన ఇన్‌స్ట్రక్టర్ల పర్యవేక్షణలో శిక్షణ నిర్వహించారు. శిక్షణ పూర్తిచేసుకొన్న వారిలో - మందిని వివిధ ఏరియాలలో నియమించడం జరిగింది.

27-10-2008న నిర్వహించిన పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మన సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్స్) శ్రీ జె.వి.దత్తాత్రేయులు గారు మాట్లాడుతూ "అంకితభావంతో, క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ కంపెనీ ఆస్తులను కాపాడటంలో అహర్నిశలు పాటుపడాలి. ఆర్మీ, పోలీస్ లాంటి పారా మిలటరీ దళాలకు ధీటుగా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించిన సిబ్బందికి నా అభినందనలు" అన్నారు.



11.1.2009న నిర్వహించిన పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మన సంస్థ డైరెక్టర్ (పర్సనల్, అడ్మినిస్ట్రేషన్ అండ్ వెల్ఫేర్) శ్రీ ఎల్.శశిధర్, ఐ.ఏ.ఎస్. మాట్లాడుతూ "పరేడ్ పరిశీలనలో సిబ్బంది ముఖాల్లో ఆత్మవిశ్వాసం గమనించాను. ఈ శిక్షణ పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నాను. సెక్యూరిటీ సిబ్బంది నిర్వహించాల్సిన విధులపట్ల పూర్తి అవగాహన ఉండాలి. అప్పుడే విధులను సక్రమంగా నిర్వహించగలరు" అని అన్నారు.



28-2-2009న నిర్వహించిన పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మన సంస్థ డైరెక్టర్ (ఫైనాన్స్) శ్రీ ఇ.వి.కృష్ణారెడ్డి గారు మాట్లాడుతూ "మార్చ్ ఫాస్ట్ మరియు పరేడ్‌లో శిక్షణ పొందిన సిబ్బంది కనబరచిన ప్రతిభ అత్యద్భుతం. కేవలం ఆరు వారాల సమయంలో చక్కని క్రమశిక్షణ గలిగిన సెక్యూరిటీ సిబ్బందిగా రూపుదిద్దడం హర్షణీయం. సంస్థకు చెందిన ఆస్తుల పరిరక్షణలోనూ, అలాగే కంపెనీ విధివిధానాల నిర్వహణ లోనూ సెక్యూరిటీ సిబ్బంది అంకితభావంతో పనిచేస్తారన్న విశ్వాసం నాకు ఉంది" అని అన్నారు.



# అటవీ గ్రామంలో సింగరేణి వైద్యశిబిరం



మణుగూరు నుండి దాదాపు 20 కి॥మీ అటవీమార్గాన పయనించాక దట్టమైన అడవిలో చుట్టూ ఎత్తైన కొండల మధ్య దాదాపు 44 ఇళ్లతో కూడిన 'బుగ్గ' అనే కుగ్రామం కనిపిస్తుంది. పగిడేరు గ్రామపంచాయితీ పరిధిలోని ఈ గ్రామం నుండి వ్యాధిగ్రస్తులను చికిత్స నిమిత్తం బండారుగూడెం పట్టణ ప్రాంతానికి తరలించాలంటే సరియైన రవాణా సౌకర్యం, రోడ్డు మార్గం లేదు.

ఇది గమనించిన మన సంస్థ పరిసర గ్రామాల ప్రజలకు ఉచిత వైద్యసేవలందించే కార్యక్రమంలో భాగంగా ది.5.11.2008న మణుగూరు ఏరియా సింగరేణి వైద్యబృందం సహాయంతో బుగ్గలో ఒక "ఉచిత వైద్యశిబిరం" నిర్వహించింది.

ఈ వైద్యశిబిరంలో వివిధరకాల జబ్బులతో బాధపడుతున్న దాదాపు 73 మంది వ్యాధిగ్రస్తులు ఉచిత వైద్య పరీక్షలతోపాటు ఉచితంగా మందులుకూడా పొందారు. ఇక్కడి వారిలో ఎక్కువమంది మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నట్లు వైద్యులు గుర్తించి తదనుగుణంగా వైద్యసేవలు అందించారు.

ఈ కార్యక్రమంలో కె.ఒ.సి. ప్రాజెక్ట్ అధికారి శ్రీ పి.శ్రీనివాసులు, పర్యావరణ అధికారి శ్రీ సిహెచ్.సదానదం, డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, అండర్ మేనేజర్ శ్రీ గోపాల్‌రెడ్డి, కమ్యూనికేషన్ మరియు సింగరేణి సేవా సమితి విభాగాలవారు పాల్గొన్నారు.









## రామగుండం-2 ఏరియాలో మెడికల్ క్యాంపు

సమీప గ్రామాల సేవలో భాగంగా రామగుండం-2 ఏరియా పరిధిలోని పెద్దంపేట, మంగళపల్లి గ్రామాలలో నిర్వహించిన మెగా మెడికల్ క్యాంపులో సమీపంలోని 6 గ్రామాలకు చెందిన 1700 మంది స్థానికులు మన వైద్యుల ద్వారా ఉచిత వైద్య సేవలు, పరీక్షలు, మందులు అందుకున్నారు. ఈ సందర్భంగా కంపెనీ అందచేస్తున్న సేవల్ని పలువురు ప్రజా ప్రతినిధులు ప్రశంసించారు. జి.ఎం. శ్రీ జి.రాజేందర్‌రెడ్డి సారథ్యంలో ఈ మెడికల్ క్యాంపును నిర్వహించారు.

### నిరుద్యోగులైన యువకులకోసం ఉచిత మోటారు డ్రైవింగ్ కోర్సు

సత్తుపల్లి ఓపెన్‌కాస్ట్ పరిధిలోని నిరుద్యోగులైన యువకులకోసం ఉచిత మోటారు డ్రైవింగ్ కోర్సును కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ శ్రీ సి.హెచ్, విజయారావు ఫిబ్రవరి 13 వతేదీన ప్రారంభించారు. రేజర్ల, కొమ్మేపల్లి, కిష్టారం, వెంగళ్రావునగర్, సత్తుపల్లి గ్రామాలకు చెందిన 25 మంది యువకులు దీనిలో శిక్షణ పొందుతున్నారు. గతంలో ఇక్కడ టైలరింగ్, కంప్యూటర్ హార్డ్‌వేర్ శిక్షణ కూడా ఇప్పించటం జరిగింది.

## పేద గిరిజనులకు రగ్గులు, దుప్పట్లు పంపిణీ

మందమర్రి ఏరియాలోని మారుమూల గిరిజన గ్రామాల పేదలు దాదాపు 1500 మందికి మన సంస్థ రగ్గులు, దుప్పట్లను అందచేసింది. మల్కపల్లి, సోనాపూరు, కోనూరు, దేవాపూర్ పేదలకు ఈ సహాయం అందించారు. ఫిబ్రవరి 9వ తేదీన జరిగిన ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీ విజయకుమార్, మంచిర్యాల ఆర్.డి.ఓ. శ్రీ ప్రసాద్‌లు వీటిని



పేదలకు అందచేసి, కంపెనీ సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఏరియా జనరల్ మేనేజర్ శ్రీ ఆంథోనిరాజా తదితరులు పాల్గొన్నారు.



# ఆ ప్రమాదాలు ఎలా జరిగాయంటే...



మన సింగరేణిని ప్రమాద రహిత సంస్థగా రూపుదిద్దాలంటే ప్రతి ఒక్కరూ రక్షణతో పనిచేయాలి. రక్షణ మదిలో, గనిలో, పనిలో పాటిస్తూపోతే, గతం నుంచి గుణపాఠాలు నేర్చుకుంటే రక్షణ పాటించటం అసాధ్యమేమి కాదు. కనుక గతంలో జరిగిన కొన్ని ప్రమాదాలను, వాటి కారణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి ఈ శీర్షికలో అందచేస్తున్నాం.

## డ్యూటీలో నిద్ర ప్రాణం తీసింది

ప్రమాదము తేది : 26.05.1997

పేరు : యం.డి. అబ్దుల్ ఖాదిర్, టిప్పర్ డ్రైవర్, కాంట్రాక్ట్ కార్మికుడు, ఓ.సి.2, ఆర్.జి.3, 3వ షిఫ్ట్, 1:15 ని॥లకు

**ప్రమాదమునకు కారణము:**

టిప్పర్ డ్రైవర్ పార్కింగ్ చేయబడిన తన వాహనము ప్రక్కన నిద్రపోవుచుండగా పార్కింగ్ చేయుటకు వచ్చుచున్న వేరొక టిప్పర్ అతనిపైనుండి పోవుట వలన ప్రమాదము జరిగినది.

**నివారణ చర్యలు :**

1. డ్యూటీలో నిద్రపోకూడదు.
2. పనిలేనప్పుడు విశ్రాంతి సమయములో రెస్ట్ షెల్టర్‌లోనే కూర్చోవాలి.
3. ఓపెన్‌కాస్ట్ లైటింగ్, వాహనము యొక్క లైట్స్ అకస్మాత్తుగా ఆరిపోయినను కనబడేటంతగా ఉండవలెను.
4. సూపర్‌వైజర్స్ కార్మికులు ప్రమాదము కలిగించుకొనే పనులు చేయకుండా చూడాలి.

## అజాగ్రత్తే మృత్యువైంది

ప్రమాదము తేది : 01.07.1999

పేరు : గొల్లపెల్లి రాజు, టిప్పర్ హెల్పర్ కాంట్రాక్ట్ కార్మికుడు ఓ.సి.2, ఆర్.జి.3, 1వ షిఫ్ట్, 8:30 ని॥లకు

**ప్రమాదమునకు కారణము:**

ఆయిల్ లీకేజ్ అవుచున్న హాయిస్ట్ సిలిండర్‌ను ట్రక్ బకెట్‌కు ఇనుప రాడ్ పెట్టి రిపేర్ చేయుచుండగా ఆ రాడ్ జారిపడుటవలన ట్రక్కు బకెటు రాజు తల మీద పడి తల పగిలి మరణించాడు.

**నివారణ చర్యలు :**

1. పైకి లేపిన ట్రక్ బాడీకి రెండు వైపుల బాడీ సపోర్టింగ్ రాడ్ సపోర్ట్ చేసిన తరువాతనే వాహనమును రిపేరు చేయుటకు ప్రారంభించవలెను.

## అతి వేగం ప్రాణాంతకం

ప్రమాదము తేది : 16.02.2001

పేరు : యం. రమేశ్, డ్రైవర్, కాంట్రాక్ట్ కార్మికుడు, ఓ.సి.4, ఆర్.జి.1

**ప్రమాదమునకు కారణము:**

ఇతను డంప్ యార్డ్ నుండి వాహనము డ్రైవింగ్ చేయుచుండగా కంట్రోల్ తప్పి లోడు టిప్పర్‌ను ఢీ కొనుటవలన మరణించాడు.

**నివారణ చర్యలు :**

1. ప్రతి డ్రైవర్ తన వాహనము నడుపుట ప్రారంభించకముందు అది నడుచు కండీషన్‌లో ఉన్నదా లేదా అని చెక్ చేసుకొనవలెను.
2. ప్రతి 15 రోజులకు ఒకసారి ముందుగా నిర్ణయించబడిన ఇంజనీర్ మైన్‌లో తిరిగే వాహనములు ఏవేవి సరియైన కండీషన్‌లో ఉన్నవో అని చూసి వాటికి మాత్రమే రోడ్డు వర్తీనెస్ సర్టిఫికెట్ ఇవ్వవలెను.
3. డ్రైవర్స్ అందరికి కోడ్ ఆఫ్ ట్రాఫిక్ రూల్స్ వివరించి వ్రాత పూర్వకంగా తెలియజేయవలెను.
4. క్వారీలో ఏ వాహనము గంటకు 25 నుండి 30 కి॥మీ॥ కన్నా ఎక్కువ వేగముగా నడుపరాదు.

## రక్షణ నియమం పాటించకుంటే...

ప్రమాదము తేది : 19.11.2005

పేరు : శ్రీ సూరపు రామిరెడ్డి, ఇ.పి. ఆపరేటర్, పి.కె. ఓ.సి.2, మణుగూరు 2వ షిఫ్ట్, 9:00 గం॥లకు

**ప్రమాదమునకు కారణము:**

డోజర్ సెకండ్‌గేర్‌లో ఉన్నప్పుడు డోజర్ దిగుటకు ప్రయత్నించుచుండగా (ఓవర్‌మెన్‌తో మాట్లాడుటకు) అతని కాలు యాక్సిలేటర్ మీద పడుట వలన డోజర్ ముందుకు కదిలి ఎడమ ప్రక్క డోజర్ క్రాలర్ చైన్ క్రింద పడి మరణించాడు.

**నివారణ చర్యలు :**

1. డోజర్ దిగునప్పుడు ఆపరేటర్ ఇంజన్ ఆపి దిగవలెను.
2. డోజర్‌లో అన్ని సేఫ్టీ పరికరములు పనిచేయు కండీషన్‌లో ఎల్లప్పుడు ఉండేటట్లు చూచుకొనవలెను.
3. డైలీ మెయింటెనెన్స్ చెక్‌లిస్ట్‌లో గేర్ లాకింగ్ టెస్ట్ కూడా ఉండవలెను.
4. ఇ.పి. ఆపరేటర్స్‌కు, మెయింటెనెన్స్ సిబ్బందికి రిఫ్రెషర్ ట్రైనింగ్ ఇవ్వవలెను.
5. ఫోల్డింగ్ చేసుకొనే నిచ్చన దిగుటకు, ఎక్కుటకు డోజర్‌కు ఏర్పాటు చేసే అవకాశం గురించి దానియొక్క తయారీదారును అడుగవలెను.
6. ప్రతి డోజర్‌కు న్యూట్రల్ స్విచ్ / గేర్ ఉండాలి అది ఎప్పుడు పనిచేస్తూ ఉండేటట్లు చూడాలి.

## అప్రమత్తంగా లేకుంటే...

ప్రమాదము తేది : 02.06.2006

పేరు : శ్రీ యం. జనార్ధన్, మిషన్ హెల్పర్, కాంట్రాక్ట్ కార్మికుడు సి.ఓ.సి., మణుగూరు, 2వ షిఫ్ట్, 4:30 గం॥లకు

**ప్రమాదమునకు కారణము:**

5 గం॥లకు షావల్ మెయింటెనెన్స్ చేయుటకు ముందుగా వచ్చి దానికి కొంచెము దూరములో ఉన్న ఒక పెద్ద బండ ప్రక్కన జనార్ధన్ విశ్రాంతి తీసుకొంటున్నాడు. డ్రిల్లింగ్ ఏరియా కొరకు లూజు బండలు మట్టి తొలగించుటకు ఓవర్‌మెన్‌కు తెలియకుండా 4:30 ని॥లకు షావల్‌ను నియమించారు. బండ ప్రక్కన విశ్రాంతి తీసుకొనుచున్న జనార్ధన్‌ను షావల్ ఆపరేటర్ చూడక పోవుట వలన షావల్ బకెట్ బండకు తాకి ఆ బండ అతని పొట్టమీద పడి మరణించాడు.

**నివారణ చర్యలు :**

1. మిషన్ స్వింగ్ ఏరియా లోనికి, దానినుండి 30 మీ॥ల దూరము వరకు ఎవరు ప్రవేశించరాదు.
2. మైన్ అధికారులకు మరియు ఆఫ్ లోడింగ్ ఇన్‌చార్జ్‌లకు మధ్య మిషన్ ప్లేసింగ్‌ల గురించి సరైన అవగాహన ఉండాలి.
3. పనివారిని పనిలో నియమించక ముందు పని స్థలములో జారిపడే బండలున్నాయేమోనని సూపర్‌వైజర్స్ చూసుకోవాలి.
4. మెయింటెనెన్స్ టైమింగ్‌కు ముందు ఎవరు మిషన్ యొద్దకు పోకూడదు.
5. క్వారీలో పనిచేయు ప్రతి ఒక్కరు కోడ్ ఆఫ్ ప్రాక్టీస్ ప్రకారము పనిచేయవలెను.

# ప్లాస్టిక్ బ్యాగులకు మంగళం - పేపర్ బ్యాగులకు స్వాగతం

## రామగుండం -2 ఏరియాలో వినూత్న పర్యావరణ హిత కార్యక్రమం


శిక్షణలో పాల్గొన్న మహిళలు

రామగుండం-2 ఏరియా పర్యావరణ చైతన్య కార్యక్రమాలలో ఎంతో ముందుంటుంది. దీనిలో భాగంగా ఈ ఏరియాలో ప్లాస్టిక్ సంచులవాడకంలో మహిళలు స్వయం నిషేధం ప్రకటించుకున్నారు. దీనిపై యాజమాన్యం ప్రత్యేక చొరవ చూపించింది. హేండ్‌మేడ్ పేపర్ కవరుల తయారీ కోసం హైదరాబాద్‌కు చెందిన ఖాదీ గ్రామోద్యోగ్ విద్యాలయ సహకారంతో నెల రోజులపాటు శిక్షణా తరగతులను నిర్వహించింది. దీనిలో దాదాపు 80 మంది మహిళలు పాల్గొన్నారు. మార్చి 9న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఏరియా జి.ఎం. శ్రీ జి.రాజేందర్‌రెడ్డి, జి.ఎం. (వెల్ఫేర్) శ్రీ జి.అయిలయ్య, సేవా అధ్యక్షురాలు శ్రీమతి ఇందిరా దత్తాత్రేయులు పాల్గొన్నారు. నిరుద్యోగులైన కార్మికుల పిల్లలు, సమీప గ్రామాల ప్రజలు కూడా దీనిలో ఉత్సాహంగా పాల్గొని శిక్షణపొందారు. శిక్షణా కాలంలో పెద్ద ఎత్తున పేపర్ కవర్లు, బ్యాగులు, వస్తువులు తయారు చేశారు. ప్లాస్టిక్ నిషేధంలో భాగంగా తొలిదశలో వీళ్ళు తయారుచేసిన పేపర్ కవర్లను స్థానిక ఏరియా ఆసుపత్రులలో వినియోగించాలని జి.ఎమ్. ఆదేశించారు. దీంతో కంపెనీ ఆసుపత్రులలో మందులు ఇచ్చే ప్లాస్టిక్ కవరుల స్థానంలో పేపర్ కవర్ల వాడకం ప్రారంభమైంది. అలాగే రామగుండం-2 ఏరియాలో ఎక్కువ శాతం గృహిణులు పేపర్ బేగులను వాడుతున్నారు.


మహిళలు తయారుచేసిన పేపర్ బ్యాగులు ఆసక్తితో తిలకిస్తున్న అతిథులు

**పేపర్ బ్యాగుల తయారీ పరిశ్రమల ఏర్పాటుకు సన్నాహాలు**

పేపర్ బ్యాగుల తయారీపట్ల వచ్చిన స్పందనను గమనించిన యాజమాన్యం శిక్షణపొందిన 80మంది మహిళలతో 8 గ్రూపులను ఏర్పాటు చేసింది. ఈ గ్రూపుల ద్వారా హేండ్‌మేడ్ పేపర్ కవర్లు, బ్యాగులు తయారుచేయడానికి కరీంనగర్ జిల్లా పరిశ్రమలశాఖ వారి అనుమతి కోసం దరఖాస్తు చేయించింది. పరిశ్రమలశాఖ అనుమతించిన వెంటనే ఇక్కడ కుటీర పరిశ్రమలు నెలకొల్పుతామని తద్వారా ఏరియాలోనే కాక సింగరేణి అంతటికి కవర్లు, బ్యాగులు విక్రయించనున్నామని మహిళలు గర్వంగా చెప్తున్నారు. రామగుండం ఏరియా చూపిన ఈ చొరవ మిగిలిన వారికి కూడా స్ఫూర్తి కలిగించాలని ఆశిద్దాం.

## దురలవాట్లు మానండంటూ మహిళల ప్రదర్శనలు


బెల్లంపల్లిలో మహిళల ప్రదర్శన

మద్యంపై బెల్లంపల్లి, ఇల్లెందు ఏరియా సేవా మహిళలు తమ ఆగ్రహం ప్రకటిస్తూ ఆయా ఏరియాల్లో పెద్ద ఎత్తున ప్రదర్శన నిర్వహించారు. దుర్వ్యసనాలు మానండి. ఆరోగ్యాన్ని కాపాడుకోండి అంటూ నినాదాలు చేసారు. ప్రదర్శనలో మహిళలు చేసిన నినాదాలు, ప్లే కార్డులు అందరినీ ఆలోచింపచేసాయి.


ఇల్లందులో మహిళల ప్రదర్శన

# సింగరేణి అంతటా ఘనంగా మహిళాదినోత్సవం






మార్చి 8 మహిళా దినోత్సవం సందర్భంగా అన్ని ఏరియాల్లో వందలాది మహిళలు కదలివచ్చి సింగరేణి మహిళల సమైక్యతనూ, చైతన్యాన్ని ప్రజలకు చాటి చెప్పారు. 3 నుంచి వారం రోజులపాటు మహిళల కోసమే ప్రత్యేకించి నిర్వహించిన క్రీడలు, ఉపన్యాస పోటీలలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కొన్నిచోట్ల సదస్సులు కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమాలు కొన్నింటిలో సేవా అధ్యక్షురాలు శ్రీమతి ఇందిరా దత్తాత్రేయులు ముఖ్యఅతిథిగా పాల్గొని సింగరేణి మహిళల బాధ్యతలను గుర్తుచేస్తూ చైతన్య పరిచారు. బెల్లంపల్లి ఏరియాలో మహిళాదినోత్సవం సందర్భంగా ఒక పెద్ద ప్రదర్శన నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకం మానాలనీ, మద్యం మానాలనీ మహిళలు నినదించారు. వినూత్నంగా నిర్వహించిన రక్తదాన కార్యక్రమంలో అనేకమంది మహిళలతోపాటు సేవా అధ్యక్షురాలు శ్రీమతి ఇందిరా దత్తాత్రేయులు కూడా పాల్గొన్నారు. మందమర్రి సదస్సులో వందలాదిమంది మహిళలు పాల్గొన్నారు. జి.ఎమ్. వెల్ఫేర్ శ్రీ జి. అయిలయ్య, సేవా అధ్యక్షురాలు మాట్లాడుతూ సింగరేణి సంస్థ అభివృద్ధిలో సింగరేణి మహిళలు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. శ్రీరాంపూర్ ఏరియాలో అక్షరాస్యులైన మహిళలకు, బోధకులకు ప్రోత్సాహకాలు అందజేశారు. రామగుండం-1, రామగుండం-2, రామగుండం-3 లో మహిళలకు వివిధ అంశాల్లో పోటీలు జరిపి బహుమతులు అందించారు. పై ఏరియాల్లో స్థానిక డాక్టర్లు, లాయర్లు పాల్గొని మహిళల్ని చైతన్యపరిచారు. భూపాలపల్లి, ఇల్లందు, మణుగూరు ఏరియాల్లో కూడా మహిళలు ప్రదర్శనలు నిర్వహించి రక్షణ, విద్యుత్ పొదుపువంటి అంశాలపై ప్రజల్ని ఆలోచింపజేశారు. కొత్తగూడెంలో జరిగిన ముగింపు ఉత్సవంలో ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీమతి ఇందిరా దత్తాత్రేయులు మాట్లాడుతూ సింగరేణి మహిళలు అన్నింటా ముందుండి సంస్థ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. మొత్తం మీద సింగరేణి వ్యాప్తంగా జరిగిన మహిళాదినోత్సవ వేడుకలు మహిళల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. ఈ కార్యక్రమాల్లో అన్ని ఏరియాల సేవా అధ్యక్షురాళ్లు, జనరల్ మేనేజర్లు, అధికారులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాలు విజయవంతం చేయడంలో సహకరించారు.











# అత్యంత వైభవంగా సింగరేణి దినోత్సవాలు

సింగరేణి దినోత్సవాలు - 2008ని సింగరేణి వ్యాప్తంగా అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రధాన వేడుకలు రామగుండం -1 ఏరియాలో ఘనంగా నిర్వహించారు. మిగిలిన అన్ని ఏరియాలలోను అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో సింగరేణి దినోత్సవాన్ని కార్మికులు, వారి కుటుంబీకులు ఒక పండుగ మాదిరిగా జరుపుకున్నారు. అన్ని ఏరియాలలో నిర్వహించిన సింగరేణి రన్‌లో వేలాదిమంది పాల్గొని మేమంతా ఒకే కుటుంబం అన్న భావనను ఉద్వేగపూరిత వాతావరణంలో వ్యక్తపరచుకున్నారు. సింగరేణి వ్యాప్తంగా జరిగిన ఉత్సవాల చిత్రాలను ఈ దిగువనిస్తున్నాం.





రామగుండం-1 సెంట్రల్ ఫంక్షన్ దృశ్యాలు







భూపాలపల్లి లో..



కొత్తగూడెం లో..



శ్రీరాంపూర్ లో..



ఇల్లందు లో..



మణుగూరు లో..



బెల్లంపల్లి లో..



రామగుండం-2 లో..



మందమర్రి లో..



రామగుండం-3 లో..

# అన్ని ఏరియాల్లో ఘనంగా గణతంత్ర దినోత్సవాలు

జనవరి 26, 2009న సింగరేణి వ్యాప్తంగా గణతంత్ర దినోత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. కొత్తగూడెంలో జరిగిన సెంట్రల్ పంక్షన్‌లో మన ఛైర్మన్ అండ్ ఎం.డి. శ్రీ ఎస్.నర్సింగ్‌రావు, మరియు మన డైరెక్టర్లు పాల్గొన్నారు. కొత్తగూడెంతో పాటు అన్ని ఏరియాల్లో ఉత్తమ ఉద్యోగులను ఈ వేడుకల్లో సన్మానించడం జరిగింది. వివిధ పాఠశాలల విద్యార్థినీవిద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. దేశ సేవకు మనమంతా పునరంకితమవ్వాలని ఈ సందర్భంగా అతిథులు పిలుపునిచ్చారు. వివిధ ఏరియాల్లో జరిగిన గణతంత్ర దినోత్సవాల చిత్రమాలిక.




కొత్తగూడెం సెంట్రల్ ఫంక్షన్ దృశ్యాలు







రామగుండం-1 లో..



శ్రీరాంపూర్ లో..



ఇల్లందు లో..



రామగుండం-2 లో..



బెల్లంపల్లి లో..



మణుగూరు లో..



మందమర్రి లో..



రామగుండం-3 లో..



కొత్తగూడెం లో..

# 184 మందికి ఆర్మీ, పోలీసుశాఖల్లో ఉద్యోగాలు కల్పించిన సేవా సమితి



- 739 మందికి ఉపాధి శిక్షణలు
- 48 మందికి స్వయం ఉపాధి యూనిట్లు
- 618 మందికి వృత్తి శిక్షణలు.

# 2008-09లో సేవా సమితి ద్వారా అనేక కార్యక్రమాలు

**సింగరేణి సేవా సమితి 2008-09లో కార్మికుల భార్యాపిల్లల కోసం, సమీప గ్రామాల ప్రజలకోసం అనేకానేక కార్యక్రమాలు చేపట్టింది. సేవాసమితి ద్వారా చేపట్టిన కార్యక్రమాలపై సంక్షిప్త సమాచారం సమర్పిస్తున్నాం.**

## 184 మంది యువకులకు ఉద్యోగావకాశాలు

సేవా సమితి సాధించిన విజయాలలో ప్రముఖంగా చెప్పుకోతగింది ఆర్మీ పోలీస్ శాఖల్లో యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం. గత ఏడాదిలో నిర్వహించిన వివిధ రకాల ఆర్మీ ర్యాలీల కోసం 573 మంది యువకులకు ఉచిత శిక్షణ ఇప్పించగా వీరిలో 184 మంది ఎంపికవడం చక్కని విజయంగా పేర్కొనవచ్చు. ఈ 184 మందిలో 18 మంది పోలీసు ఎస్.ఐ.లు కూడా ఉన్నారు. దీనితో సింగరేణి సేవా సమితి ద్వారా ఇప్పటివరకూ ఆర్మీ, పోలీసు శాఖల్లో ఉద్యోగాలు పొందినవారి సంఖ్య 673కు చేరుకుంది. ఇది ఏ ఇతర ప్రభుత్వ రంగ సంస్థలలోని కనిపించని అరుదైన సంక్షేమ కార్యక్రమంగా కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి.



'నిరుద్యోగిగా ఉన్న నేను సింగరేణి సేవా సంస్థ అందించిన శిక్షణతో ఒక పోలీస్ ఎస్.ఐ.గా ఉద్యోగం పొందగలిగాను. నేను నా కుటుంబం ఎల్లప్పుడూ సింగరేణి సంస్థకు కృతజ్ఞులం.' – **ఎం.డి.తాజుద్దీన్, తండ్రి సిరాజుద్దీన్, ఫిట్టర్, వర్క్‌షాపు, మందమర్రి.**

'నా తల్లి నన్ను ఒక పోలీస్ అధికారిగా చూడాలని కన్న కలలు సింగరేణి సేవా సమితి ఇచ్చిన సహాయంతో నిజమయ్యాయి. నేను మా అమ్మ సింగరేణి సంస్థకు ధన్యవాదాలు చెప్తుతున్నాం.' – **ఎ.తిరుపతి, (తండ్రి కీ॥శే॥ మల్లయ్య) తల్లి సౌందర్య, జనరల్ మజ్దూర్, జి.ఎం. ఆఫీసు మందమర్రి.**



## 739 మందికి ఉపాధి శిక్షణలు



నిరుద్యోగులైన కార్మికుల పిల్లలు, సమీపగ్రామాల యువతీయువకులకోసం ఎంపిక చేయబడిన ఆరు శిక్షణాసంస్థల ద్వారా గత ఏడాది పలురకాల ఉపాధి అవకాశశిక్షణలు ఇప్పించడం జరిగింది. వీటిలో వేగంగా కుట్టే జ్యాకీ మిషన్స్ ద్వారా డ్రెస్ మేకింగ్‌లో శిక్షణ, పేపరుబ్యాగుల తయారీ, డ్రైవింగ్‌లో శిక్షణ, డి.ఎస్.సి. పరీక్షలకు (ఉపాధ్యాయుల ఎంపిక కోసం) శిక్షణ, హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్, కంప్యూటర్లు, డిటిపిలో శిక్షణ వంటివి ఉన్నాయి. వివిధ ఏరియాల్లో జరిగిన ఈ శిక్షణా కార్యక్రమాల్లో 739 మంది శిక్షణ పొందారు.




## ఖాదీ గ్రామోద్యోగ్ మహావిద్యాలయం ద్వారా 618 మందికి

అలాగే హైదరాబాద్‌కు చెందిన ఖాదీ గ్రామోద్యోగ్ మహావిద్యాలయం వారి నిర్వహణలో ఎలక్ట్రీషియన్, టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సుల్లో 618 మంది ఉచిత ఉపాధి శిక్షణలు ఇప్పించింది.

## ఇంగ్లీషు మాట్లాడటం, పెయింటింగ్‌లో శిక్షణ

కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చేయడంలో భాగంగా 130 మంది అభ్యర్థులకు స్పోకెన్ ఇంగ్లీషులో శిక్షణ ఇప్పించడం జరిగింది. అలాగే గ్లాస్ పెయింటింగ్, వాజ్ పెయింటింగ్‌లో 90 మందికి శిక్షణ ఇప్పించారు.

## స్వయం యూనిట్లతో 48 మంది స్వయం ఉపాధి

సింగరేణి ఇచ్చిన పలురకాల శిక్షణల్లో పాల్గొన్నవారిలో 48 మంది స్వంతంగా ఉపాధి యూనిట్లను ఈ ఏడాది స్థాపించుకొన్నారు. దీంతో సింగరేణిలో స్వయం యూనిట్లు పెట్టుకొన్నవారి సంఖ్య 549కి చేరింది.

## 5333 మంది మహిళలకు చదువు



నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా మార్చే ఉద్యమంలో భాగంగా 2008-09లో వివిధ ఏరియాల్లో మొత్తం 5333 మందిని అక్షరాస్యులుగా మార్చారు. దీంతో సేవాసమితి ద్వారా అక్షరాస్యులైనవారి సంఖ్య 28,000కు చేరింది. ఇంకా అక్షరాస్యులు కావాల్సిన మహిళలకోసం కార్యక్రమం కొనసాగుతుంది.

## 6326 మందికి ఐరన్, విటమిన్ సి మాత్రల పంపిణీ

12 సంవత్సరాల వయస్సు నిండిన బాలికలకు 12 గ్రాముల హీమోగ్లోబిన్ ఉండాలన్న కేంద్ర ప్రభుత్వం వారి పథకం (12/12)ను రాష్ట్రంలో తొలిసారిగా చేపట్టి, సింగరేణి ప్రాంతంలోని అన్ని పాఠశాలల్లో పరీక్షలు చేపట్టడం జరిగింది. స్క్రీనింగ్‌లో 17 సింగరేణి పాఠశాలలు, 60 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థినులు పాల్గొన్నారు. మొత్తం 11,808 మంది పిల్లలను పరీక్షించగా 6,326 మందికి రక్తహీనత ఉందని గ్రహించబడింది. వీరందరికి ఐరన్, విటమిన్ సి మాత్రలు పంపిణీ చేశారు.

## బెల్లంపల్లి, భూపాలపల్లిలో కిడ్నీ స్క్రీనింగ్

కిడ్నీ వ్యాధులు తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో ముందస్తు వైద్య పరీక్షల ద్వారా వ్యాధి ముదరకుండా చూసేందుకు బెల్లంపల్లి, భూపాలపల్లి ఏరియాల్లో కిడ్నీ స్క్రీనింగు కాంపులు నిర్వహించారు. 1327 మందికి పరీక్షలు చేయగా 97 మందికి కిడ్నీ (మూత్రపిండాల) వ్యాధులున్నట్లు నిర్ధారణ అయింది. వీరిలో 11 మంది పరిస్థితి తీవ్రస్థాయిలో ఉన్నందున వెంటనే హైదరాబాద్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు తరలించి వైద్యం అందించడం జరిగింది.

## ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం కింద 200 మందికి ఋణాలు

సేవా సమితి తీసుకొన్న చొరవ కారణంగా కొత్తగా దేశంలో అమలైన ప్రధానమంత్రి ఉపాధి హామీ కల్పన పథకం కింద అన్ని ఏరియాలనుంచి దాదాపు 200 మంది సింగరేణీయుల పిల్లలకు రుణాలు ఇప్పించడానికి అవకాశం కల్గింది. వీరికి త్వరలో ఋణాలు అందుతాయి. గతంలో గల పి.ఎం.ఆర్.వై.కి భిన్నంగా ఈ పథకం ద్వారా పట్టణ ప్రాంతీయులకు కూడా రుణ సదుపాయం ఉంటుంది.

## స్టైఫండ్‌తో కూడిన శిక్షణ

మణుగూరు ఏరియాలోని ప్రాజెక్టు ప్రభావిత గ్రామస్థులు 135 మందికి ఖాదీ కమీషన్ వారి సహకారంతో అగర్‌బత్తీ తయారీలో శిక్షణ ఇప్పించారు. వీరిలో 90 మంది మహిళలకు నెలకు 500 రూపాయల స్టైఫండ్‌ను చెల్లించడం జరిగింది. వీళ్ల తయారుచేసే అగర్‌బత్తీల మార్కెటింగుకు ఐ.టి.సి. భద్రాచలం వారితో ఒప్పందం జరిగింది. అలాగే శ్రీరాంపూర్ ఏరియాలో 20 మందికి వోల్వో భారీ వాహనాల డ్రైవింగ్‌లో శిక్షణ ఇప్పించగా సత్తుపల్లిలో 25 మందికి మోటారు కారు డ్రైవింగ్‌లో శిక్షణ ఇప్పించారు.

సింగరేణి సేవా సమితి చేస్తున్న కృషికి దేశవ్యాప్తంగా గుర్తింపు లభిస్తోంది. మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్, ఫారెస్టు శాఖవారు రాంచీలో మార్చి 2లో జరిగిన కోలిండియా కంపెనీల సమావేశానికి మన సంస్థను ఆహ్వానిస్తూ కార్పోరేట్ సంస్థల సాంఘిక బాధ్యతగా సమీప గ్రామాలవారికి సింగరేణి చేస్తున్న సేవలపై వివరించవల్సిందిగా కోరారు. ఈ సమావేశంలో చివరి రోజున మన సంస్థ కార్యకలాపాల గురించి మన బృందం వారు వివరించారు. ఈ బృందానికి డైరెక్టర్ ఆపరేషన్స్ శ్రీ జె.వి.దత్తాత్రేయులతో పాటు శ్రీ వి.ఎస్.ఆర్.మూర్తి డి.వై.పి.ఎం., శ్రీ అరర్, డి.వై.ఎస్.ఇ. (పర్యావరణశాఖ)లు ఉన్నారు.

## సమీప గ్రామ ప్రజలకోసం మెడికల్ క్యాంపులు, ఉచిత శిక్షణలు



సమీప గ్రామాల ప్రజల సౌకర్యం కోసం 2 మెగా మెడికల్ క్యాంపులను సత్తుపల్లి, పెద్దంపేట (రామగుండం-2) లలో నిర్వహించగా వందలాది గ్రామస్థులు పాల్గొని వైద్య సహాయం పొందారు. అలాగే సమీప గ్రామాల ప్రజలకోసం దాదాపు అన్నీ ఏరియాల్లో ప్రతీ నెలా సంచార వైద్య శిబిరాల ద్వారా వైద్య సహాయం అందించారు. ఈ క్యాంపుల ద్వారా మొత్తం 11,265 మంది పేదలకు పరీక్షలు, వైద్య సహాయం అందించారు.



# కోలిండియా కంపెనీల పేర్లేమిటి? అవి ఎక్కడున్నాయి?

**మన దేశంలో సింగరేణితో పాటు బొగ్గు తీస్తున్న ఇతర కోల్‌ఇండియా కంపెనీల గురించి చెప్పండి.**

1971-72, 1973 సంవత్సరాల్లో వివిధ రాష్ట్రాల్లో బొగ్గు ఉత్పత్తి చేస్తున్న బొగ్గు కంపెనీలన్నింటినీ కేంద్రం జాతీయకరణ చేసింది. వీటన్నింటినీ కలిపి కోలిండియా లిమిటెడ్ అనే పేరు పెట్టారు. కోలిండియాలో మొత్తం 9 కంపెనీలున్నాయి.

**ఆ కంపెనీల పేర్లేమిటి? అవి ఏఏ రాష్ట్రాల్లో బొగ్గు ఉత్పత్తి చేస్తున్నాయి?**

కోలిండియా లిమిటెడ్ కిందగల సంస్థలు

| క్ర. సం. | కంపెనీ పేరు | ప్రధాన కార్యాలయం | రాష్ట్రం |
|---|---|---|---|
| 1. | E.C.L. (ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్సు లిమిటెడ్) | శాంక్టోరియా దిషేర్‌గర్ | పశ్చిమబెంగాల్ |
| 2. | B.C.C.L. (భారత్‌కోకింగ్ కోల్ లిమిటెడ్) | ధన్‌బాద్ | జార్ఖండ్ |
| 3. | C.C.L. (సెంట్రల్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్) | రాంచీ | జార్ఖండ్ |
| 4. | M.C.L. (మహానదీ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్) | సంబల్‌పూర్ | ఒరిస్సా |
| 5. | N.C.L. (నార్తరన్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్) | సింగ్రౌలి (సిధి) | మధ్యప్రదేశ్ |
| 6. | W.C.L. (వెస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్) | నాగపూర్ | మహారాష్ట్ర |
| 7. | S.E.C.L. (సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్) | బిలాస్‌పూర్ | ఛత్తీస్‌గడ్ |
| 8. | N.E.C నార్త్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ | మార్గరేటా | అస్సాం |
| 9. | C.M.P.D.I.L (సెంట్రల్‌మైన్, ప్లానింగ్ అండ్ డిజైన్ ఇన్స్‌స్టిట్యూట్ లిమిటెడ్) | రాంచీ | జార్ఖండ్ |

పై తొమ్మిది కంపెనీల్లో CMPDIL అనేది బొగ్గు ఉత్పత్తి చేసే కంపెనీ కాదు. కానీ కోలిండియాలోగల కంపెనీలన్నింటికీ మైన్‌ప్లానింగ్, డిజైనింగ్ విషయాల్లో సహకరిస్తుంది. (మన సింగరేణిలో ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు శాఖ చేస్తున్న పనిని ఇది కోలిండియా కోసం చేస్తోందన్న మాట.)

**కోలిండియాలో సింగరేణి ఎందుకు విలీనం కాలేదు?**


1889 నుంచీ బొగ్గు ఉత్పత్తి చేస్తున్న మన సంస్థ 1920లో నాటి నిజాం ప్రభుత్వం వారి ఆధీనంలోకి వెళ్లింది. స్వాతంత్ర్య తర్వాత నాటి నిజాం ఈ సంస్థను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించారు. 1956లో ఇది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి సంస్థగా రూపొందింది. కాగా ఇతర రాష్ట్రాల్లో గల బొగ్గు కంపెనీలు 1971-72కు పూర్వం ప్రైవేటు పారిశ్రామిక వేత్తల చేతుల్లోనే ఉంటూ, వారి పరిశ్రమల అవసరాలు తీరుస్తుండేవి. రక్షణపై అంత శ్రద్ధ ఉండేదికాదు. దీంతో 1971-72లో వీటన్నింటినీ జాతీయం చేయాలని నిర్ణయించారు. ఆ సంవత్సరంలో కోకింగ్ కోల్ మైన్స్‌ను, 1973లో నాన్ కోకింగ్ కోల్ మైన్స్‌ను జాతీయం చేశారు. వీటినన్నింటినీ కోల్ ఇండియా లిమిటెడ్ అనే సంస్థకిందికి తెచ్చారు. అయితే ఈ సంస్థలకన్న దాదాపు రెండు దశబ్దాల ముందే సింగరేణిసంస్థ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలో ఉన్నందున దీనిని వారు కోలిండియాలో విలీనం చేయాల్సిన పని లేదనుకొన్నారు. దేశంలో నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలో ఉన్న ఏకైక సంస్థ మన సింగరేణి మాత్రమే.

**కోలిండియా, సింగరేణి కాక ఇంకా ఏవైనా ప్రభుత్వ సంస్థలు బొగ్గు ఉత్పత్తి చేస్తున్నాయా?**

అవును. 2007-08 నాటికి సింగరేణితోపాటు మరో నాలుగు సంస్థలు బొగ్గు ఉత్పత్తి చేస్తున్నాయి. వీటిలో జె.కె.ఎం.ఎల్. (జమ్మూ కాశ్మీర్ మినరల్స్ లిమిటెడ్), జె.ఎస్.ఎం., డి.సి.ఎల్., డి.వి.సి., ఐ.ఐ.ఎస్.సి.ఓ.లు ఉన్నాయి.

**దేశంలో జరుగుతున్న బొగ్గు ఉత్పత్తిలో ఎవరెవరు ఎంతెంత బొగ్గు ఉత్పత్తి చేస్తున్నారు?**

2008-09 లెక్కల ప్రకారం చూస్తే దేశంలో 493 మిలియనుటన్నులు బొగ్గు ఉత్పత్తి అయింది. దీనిలో కోలిండియా కంపెనీలన్నీ కలిసి 403.7 మిలియను టన్నులు ఉత్పత్తి చేయగా సింగరేణి 44.55 మిలియనులు ఉత్పత్తి చేసింది. ఇతర




కంపెనీలన్నీ కలిసి 44.99 మిలియన్ టన్నులు ఉత్పత్తి చేశాయి.

**వృద్ధి రేటులో మన సంస్థ పరిస్థితి ఎలా ఉంది?**

చాలా బాగుంది. గత ఏడాదితో పోలిస్తే కోలిండియా వృద్ధి రేటు 6.4 శాతం కాగా సింగరేణి వృద్ధి ఏటు 9.7. ఇది జాతీయస్థాయి వృద్ధి రేటు (8.00) కన్నా కూడా ఎక్కువ.

**ప్రైవేటుగా బొగ్గు ఉత్పత్తి చేస్తున్న సంస్థలు ఎన్ని ఉన్నాయి? వాటి ఉత్పత్తి ఎంత?**

2007-08 లెక్కల ప్రకారం ప్రైవేటు రంగంలో బొగ్గు ఉత్పత్తి చేస్తున్న వారి సంఖ్య 14 కాగా 2007-08లో వీరంతా కల్పి చేసిన ఉత్పత్తి 34 మిలియనులు మాత్రమే. 2008-09లో ప్రైవేటు సెక్టారులో చేసిన ఉత్పత్తి 44.99 మిలియన్ టన్నులు. వృద్ధి రేటు 24 శాతం కావడం గమనార్హం.

**దేశంలో అన్ని రాష్ట్రాల్లోనూ బొగ్గు లభ్యమౌతోందా?**

లేదు. మన దేశంలో గల 28 రాష్ట్రాల్లో కేవలం 12 రాష్ట్రాల్లోనే బొగ్గు గనులున్నాయి. వీటిలో బొగ్గు నిల్వల గరిష్ట సామర్థ్యం ప్రకారం మొదటిస్థానం నుంచి చూస్తే ఝార్ఖండ్ రాష్ట్రం 75.460 మిలియను టన్నులతో మొదటిస్థానంలో ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో వరుసగా, 2. ఒరిస్సా (65,263), 3. ఛత్తీస్‌గడ్ (44.134), 4. పశ్చిమబెంగాల్ (28,334), 5. మధ్యప్రదేశ్ (20,559), 6. ఆంధ్రప్రదేశ్ (18, 696), 7. మహారాష్ట్ర (9,818), 8. ఉత్తరప్రదేశ్ (1,061), 9. మేఘాలయ (459) మిలియను టన్నులు, 10. అస్సాం (372), 11. బీహార్ (160), 12. సిక్కిం (101), 13. నాగాలాండ్ (19.9) ఉన్నాయి.



# ఓసి గనుల కాంటీన్‌లలో శాఖాహార బిర్యానీ సదుపాయం





ఓపెన్‌కాస్ట్ గనులలో గల కాంటీన్‌లలో సబ్సీడీ ధరలపై అల్పాహారాలను కంపెనీ అందచేస్తున్న సంగతి మీకు తెలిసిందే. వీటికి అదనంగా ఇటీవల వెజిటబుల్ బిర్యానీ మధ్యాహ్నం పూట కార్మికుల సౌకర్యార్థం అందుబాటులో ఉంచాలని యాజమాన్యం నిర్ణయించింది. మణుగూరులో 15.03.2009న ఈ కార్యక్రమాన్ని సి.జి.ఎం. శ్రీ ఆర్.ఎస్.మంత్రి, సి.జి.ఎం. (సి.పి.పి.) శ్రీ డి.రమేష్‌కుమార్, ఇల్లందులో సి.జి.ఎం. శ్రీ సురేష్‌లు ప్రారంభించి కార్యక్రమములో పాల్గొన్న కార్మికులకు, కార్మిక నాయకులకు బిర్యానీలు అందించారు. ఈ కొత్త సౌకర్యంపై కార్మికులు హర్షం ప్రకటిస్తున్నారు. కాగా కొత్తగూడెం లోని హెడ్డాఫీసులో కూడా ఈ సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. జి.ఎం. (వెల్ఫేర్) శ్రీ జి.అయిలయ్య ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే అన్ని ఓ.సి.గనులలో ఈ అదనపు సౌకర్యం ప్రారంభించబడింది.

# సింగరేణిస్థాయిలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం - క్రీడా, సాంస్కృతిక పోటీలు





సింగరేణి కాలరీస్ యాజమాన్యం ఆధ్వర్యంలో సేవాసమితి ద్వారా అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా 03.12.2007న వికలాంగుల పాఠశాలల విద్యార్థులకు సోమవారం మణుగూరు ఏరియాలోని భద్రాద్రి స్టేడియంలో క్రీడలు నిర్వహించారు. ఈ పోటీల్లో సింగరేణి పరిధిలోని ఆర్.జి.-1, ఆర్.జి.-2, మందమర్రి, మణుగూరు ఏరియాల్లోని నాలుగు వికలాంగుల పాఠశాలలకు చెందిన 135 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఏరియా జీ.ఎం., ఆర్.ఎస్.మంత్రి ఈ క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టేడియంలో ఏర్పాటుచేసిన సభలో విశిష్ట అతిథిగా పాల్గొన్న సేవా అధ్యక్షురాలు శ్రీమతి ఇందిరా దత్తాత్రేయులు ప్రసంగిస్తూ సింగరేణి సంస్థ గత ఏడాది నుంచి సేవా సమితి ఆధ్వర్యంలో వికలాంగ విద్యార్థుల అభివృద్ధి కోసం పలు కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తోందన్నారు. తల్లిదండ్రులు కూడా అధైర్యపడకుండా తమ పిల్లలను మిగతా విద్యార్థులతో ధీటుగా పెంచాలని కోరారు.

అనంతరం ఏరియా జీ.ఎం. శ్రీ ఆర్.ఎస్. మంత్రి మాట్లాడుతూ సేవాసమితి ఆధ్వర్యంలో వికలాంగులైన చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పడం నిజంగా గర్వించదగ్గ విషమన్నారు. వీరికి విద్యాబుద్ధులు నేర్పించే ఉపాధ్యాయులను ఆయన ప్రశంసించారు. అనంతరం 30, 60, 100 మీటర్ల పరుగు పందెంలో చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పరుగులు తీసి విజేతలుగా నిలిచారు. అలాగే బాస్కెట్‌బాల్, మ్యూజికల్ ఛైర్, త్రో బాల్, లెమెన్‌స్పూన్ వంటి క్రీడా పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు అతిథులు బహుమతులను ప్రదానం చేశారు. మణుగూరు ఏరియాలో ఏర్పాటుచేసిన క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు రామగుండం, గోదావరిఖని, మందమర్రి గ్రామాలనుంచి వచ్చిన పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు స్థానిక అధికారులు చేసిన ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు.

# ఆర్.జి.-1 ఎలెవన్ వర్సెస్ ప్రెస్ క్లబ్ ఎలెవన్

పౌర సంబంధాల కార్యక్రమంలో భాగంగా జనవరి 2009న సింగరేణి ఆఫీసర్లు, పత్రికా విలేఖరుల మధ్య స్నేహపూరిత క్రికెట్ మ్యాచ్ స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఉత్సాహపూరితంగా క్రీడా స్ఫూర్తితో జరిగింది. సి.జి.ఎమ్., ఆర్.జి.-1 ఎలెవెన్ - ప్రెస్‌క్లబ్, గోదావరిఖని ఎలెవెన్ జట్ల మధ్య జరిగిన ఈ పోటీ చూపరులకు ఆహ్లాదం కలిగించింది. అత్యంత ఉత్కంఠ మధ్య జరిగిన ఈ క్రికెట్ మ్యాచ్‌లో ప్రెస్ క్లబ్ ఎలెవెన్ జట్టుపై సి.జి.ఎమ్., ఆర్.జి.-1 ఎలెవెన్ జట్టు విజయం సాధించింది. ప్రెస్ క్లబ్ ఎలెవెన్ జట్టు 106 పరుగులకు ఆలౌట్ కాగా 4 వికెట్ల నష్టానికి 107 పరుగులు సాధించి సి.జి.ఎమ్. ఆర్.జి.-1 జట్టు ఘన విజయం సాధించింది. సింగరేణి జట్టులో జాన్ ఆనంద్ 47 పరుగులు, ఉమాకాంత్ 67 పరుగులు, సుభాష్‌చంద్ర 24 పరుగులు సాధించి సింగరేణికి విజయం సాధించిపెట్టారు. సి.జి.ఎమ్., ఆర్.జి.-1 శ్రీ ఎ.మనోహర్‌రావు గారు తన బౌలింగ్‌లో ఒక వికెట్ సాధించి స్ఫూర్తి కలిగించారు.

## వార్తాచిత్రాలు

**కొనసాగుతున్న మహిళా అక్షరాస్యత**



ఇల్లందులో శ్రద్ధగా చదువు నేర్చుకుంటున్న మహిళలు.

**వరల్డ్ థింకింగ్ డే**



కొత్తగూడెంలో స్కౌట్స్, గైడ్స్ రోవర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ర్యాలీలో ఒక దృశ్యం.

**చదువుకు ప్రోత్సాహం**



పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు యాజమాన్యం స్కాలర్‌షిప్‌లు అందిస్తుంది.

# విజయవంతంగా 23వ కోల్ ఇండియా ఇంటర్ కంపెనీ లాన్ టెన్నిస్ పోటీలు


టీమ్ ఛాంపియన్ షిప్ విన్నర్స్–ఎస్.ఇ.సి.ఎల్

సింగరేణి కాలరీస్ కంపెనీ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు 23వ కోలిండియా ఇంటర్ కంపెనీ లాన్ టెన్నిస్ పోటీలు కొత్తగూడెంలో నిర్వహించారు.

ఈ సింగరేణి కాలరీస్ డైరెక్టర్ (పా) శ్రీ ఎల్.శశిధర్, ఐఏఎస్ ముఖ్య అతిథిగా పాల్గొని ఈ క్రీడా పోటీలను ప్రారంభించారు.

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముందుగా డైరెక్టర్ (పా) ఒలింపిక్ క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. ఆ తర్వాత సింగరేణి క్రీడాధికారి శ్రీ జె.రాజకొమరయ్య ఈ పోటీలలో పాల్గొంటున్న వివిధ బొగ్గు సంస్థలనుండి వచ్చిన క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయించారు.

ఈ సందర్భంగా డైరెక్టర్ (పా) శ్రీ ఎల్.శశిధర్ మాట్లాడుతూ సింగరేణి సంస్థకు ఈ ఏడాది లాన్ టెన్నిస్ పోటీల నిర్వహణను కేటాయించినందులకు కోలిండియా ఛైర్మన్‌కు మరియు డైరెక్టర్ (పర్సనల్)కు కృతజ్ఞతలు తెలియజేశారు. సింగరేణి సంస్థ క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించడానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూనే ఉన్నదని, వివిధ కోల్ కంపెనీల నుండి వచ్చిన క్రీడాకారులు ఎలాంటి ఇబ్బంది లేకుండా సింగరేణి ఆతిథ్యంలోని ఆప్యాయత అనురాగాలను రుచి చూడాలని, అనుభూతులను మూటకట్టుకొని వెళ్ళాలని ఆకాంక్షించారు. గెలుపు ఓటములు ముఖ్యం కాదని అంతిమ విజయం క్రీడా స్ఫూర్తిదేదని పేర్కొన్నారు.

కార్యక్రమంలో ముందుగా జనరల్ మేనేజర్ (వెల్ఫేర్) మరియు టోర్నమెంట్ చీఫ్ కో–ఆర్డినేటర్ శ్రీ జి.అయిలయ్య క్రీడా నివేదికను సభకు సమర్పించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో గౌరవ అతిథిగా పాల్గొన్న చీఫ్ జనరల్ మేనేజర్ (పర్సనల్) మరియు టోర్నమెంట్ ప్రెసిడెంట్ శ్రీ ఎమ్. గంగిరెడ్డి మాట్లాడుతూ 1992 నుండి కోలిండియా లాన్ టెన్నిస్ పోటీలలో సింగరేణి క్రీడాకారులు పాల్గొంటూ ఇప్పటివరకు పది పర్యాయాలు ప్రథమ స్థానం, ఏడు పర్యాయాలు ద్వితీయస్థానం కైవసం చేసుకున్నారని అన్నారు.


టీమ్ ఛాంపియన్ షిప్ రన్నర్స్–సింగరేణి

సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఏఐటియుసి డిప్యూటీ జనరల్ సెక్రటరీ శ్రీ డి.శేషయ్య, కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సింగరేణి బ్రాంచ్ కోశాధికారి మరియు చీఫ్ జనరల్ మేనేజర్ (ఫైనాన్స్ అండ్ అక్కౌంట్స్) శ్రీ వి.రఘువీరప్రసాద్‌లు ప్రసంసించారు.

23వ కోల్ ఇండియా ఇంటర్ కంపెనీ లాన్ టెన్నిస్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ సూచికగా శాంతి పావురాలను, రంగురంగుల బెలూన్లను డైరెక్టర్ (పా) మరియు ఇతర అతిథులు ఎగురవేశారు. ఆ తర్వాత ఈ పోటీలలో పాల్గొంటున్న ఆరు బొగ్గు సంస్థల జట్లలోని క్రీడాకారులను స్పోర్ట్స్ ఆఫీసర్ శ్రీ జె.రాజకొమరయ్య అతిథులకు పరిచయం చేశారు.

ఈ పోటీలను మూడు రోజులపాటు కొత్తగూడెం, ఇల్లెందు క్లబ్ మరియు మెయిన్ హాస్పిటల్ లోని టెన్నిస్ కోర్టులలో నిర్వహించారు.

**విజేతలు వీరే :** ఈ పోటీలలో ఎస్.ఇ.సి.ఎల్ జట్టు టీం ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకుంది. రన్నర్స్‌గా మన సింగరేణి జట్టు నిలిచింది. ఓపెన్ సింగిల్స్‌లో మన సంస్థకు చెందిన శ్రీ ఎస్.రవికుమార్ విజేతగా నిలిచాడు. రన్నర్‌గా ఎస్.ఇ.సి.ఎల్.కు చెందిన శ్రీ ఎమ్.జతిన్‌కుమార్ గెలుపొందాడు.


ఓపెన్ సింగిల్స్ విజేత ఎస్.రవికుమార్

బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో మన డైరెక్టర్ (పి & పి) శ్రీ డి.ఎల్.ఆర్.ప్రసాద్, డైరెక్టర్ (ఫైనాన్స్) శ్రీ ఇ.వి.కృష్ణారెడ్డి, ముఖ్యఅతిథులుగా పాల్గొన్ని బహుమతులు అందజేశారు. టోర్నమెంట్ నిర్వహణ ఆధ్యంతం అద్భుతంగా ఉందని కోల్ ఇండియా కంపెనీల టీములు తమ హర్షాన్ని వ్యక్తం చేశాయి.

# కొత్తగూడెంలో సింగరేణి కాలరీస్ ఎస్.సి./ఎస్.టి. ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన భవన ప్రారంభోత్సవం



కొత్తగూడెం పట్టణంలో హెడ్ ఆఫీస్ ఎదురుగా నిర్మించిన సింగరేణి కాలరీస్ ఎస్.సి./ఎస్.టి. అసోసియేషన్ కార్యాలయ భవనాన్ని సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ఎస్.నర్సింగ్‌రావు, ఐ.ఎ.ఎస్. 09.11.2008న ప్రారంభించారు. నూతన భవన ప్రారంభోత్సవం అనంతరం డా. బి.ఆర్.అంబేద్కర్ రూపొందించిన పతాకాన్ని డైరెక్టర్ (ఆపరేషన్స్) శ్రీ జె.వి.దత్తాత్రేయులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి సి.ఎమ్.డి. శ్రీ ఎస్.నర్సింగ్‌రావు మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఎస్.సి., ఎస్.టి. ఉద్యోగుల సంక్షేమానికి, వారి అభివృద్ధికి ఎప్పుడూ ప్రాధాన్యత నిస్తుందని, రాజ్యాంగపరంగా వారికి రావలసిన రాయితీలను ఇవ్వడంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని అన్నారు. ఈ అసోసియేషన్ ఏర్పడిన స్ఫూర్తితో ముందుకు సాగాలని సింగరేణి సంస్థ పురోభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలను అందించాలని కోరుతూ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఇంకా ఈ సభలో శ్రీ కె.రంగస్వామి, ఎస్.సి., ఎస్.టి. చీఫ్ లైజన్ ఆఫీసర్ అధ్యక్షత వహించారు. వేదికపై ఇంకా శ్రీయుతులు జె.వి.దత్తాత్రేయులు, డైరెక్టర్ (ఆపరేషన్స్), డి.ఎల్.ఆర్.ప్రసాద్, డైరెక్టర్ (ప్లానింగ్–ప్రాజెక్ట్), ఇ.వి.కృష్ణారెడ్డి, ఐ.ఆర్.ఎస్. డైరెక్టర్ (ఫైనాన్స్), ఎల్.శశిధర్, ఐ.ఎ.ఎస్., డైరెక్టర్ (పా), ఎమ్.గంగిరెడ్డి, సి.జి.ఎం. (పర్సనల్), సూర్యనారాయణ, సి.జి.ఎమ్. సెంట్రల్ స్టోర్స్, సిహెచ్.విజయరావు, జి.ఎమ్. కొత్తగూడెం ఏరియా, బి.చంద్రు, జి.ఎమ్. (ఆర్ అండ్ డీ), ఎమ్.ఎస్.వెంకట్రామయ్య, ప్రెసిడెంట్, సి.ఎమ్.ఒ.ఎ.ఐ., ప్రకాశ్ జాదవ్ డి.ఎస్పీ. కొత్తగూడెం, సామ్యా నాయక్, లైజన్ ఆఫీసర్, వై.గట్టయ్య వర్కింగ్ ప్రెసిడెంట్, గుర్తింపు కార్మిక సంఘం, ఎస్.సి.ఎస్.టి. అసోసియేషన్ అధ్యక్షులు, ఎస్.రాయమల్లు, జనరల్ సెక్రటరీ, పులి మోహన్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఈశ్వర్ సింగ్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎమ్.పున్నయ్య పాల్గొన్నారు.



ఈ సందర్భంగా ఎస్.సి., ఎస్.టి. ఉద్యోగుల సంఘం సభ్యులు సి.ఎమ్.డి. గారిని ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందచేశారు.

ఈ కార్యక్రమంలో ఇంకా సింగరేణి కాలరీస్ అధికారులు, ఉద్యోగులు, కార్మికులు, వివిధ ఏరియాలకు చెందిన ఎస్.సి., ఎస్.టి. అసోసియేషన్ నాయకులు, లైజన్ ఆఫీసర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా జరిగిన 43వ రక్షణ వారోత్సవాల బహుమతుల ప్రధానోత్సవం






43వ రక్షణ వారోత్సవాల బహుమతి ప్రధానోత్సవం శ్రీరాంపూర్ ఏరియాలోని ప్రగతివనం గ్రౌండ్స్‌లో డిసెంబర్ 28, 2008న అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిథిగా డి.వై.డి.జి.ఎం.ఎస్. శ్రీ సతీష్‌పురి హాజరుకాగా, నాటి సభాకార్యక్రమానికి మన ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ఎన్.నర్సింగ్‌రావు, అధ్యక్షత వహించారు. అలాగే మన ఉన్నతాధికారులు శ్రీ జె.వి.దత్తాత్రేయులు, డైరెక్టర్ ఆపరేషన్స్, శ్రీ డి.ఎల్.ఆర్.ప్రసాద్, డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్, డైరెక్టరేట్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ అధికారులు శ్రీ పి.రంగనాధీశ్వర్ (డి.ఎం.ఎస్-రీజియన్-1), శ్రీ వి.లక్ష్మినారాయణ (డి.ఎం.ఎస్-రీజియన్-2), గుర్తింపు కార్మిక సంఘం ఎ.ఐ.టి.యు.సి. జనరల్ సెక్రటరీ శ్రీ వాసిరెడ్డి సీతారామయ్య తదితరులు అతిథులుగా పాల్గొన్నారు. శ్రీరాంపూర్ ఏరియా సి.జి.ఎం. శ్రీ ఎం.శేషకుమార్‌రెడ్డి సభకు స్వాగతం పలుకగా సి.జి.ఎం. సేఫ్టీ శ్రీ సి.హెచ్.కృష్ణయ్య వార్షిక రక్షణ నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా రక్షణ వారోత్సవాలలో వివిధ విభాగాల్లో ప్రథమ, ద్వితీయస్థానాలు పొందిన గనులకు అతిథులు బహుమతులను అందజేశారు. అలాగే దీర్ఘకాలం ప్రమాదాలు ఎరుగని ఉత్తమ కార్మికులకు కూడా బహుమతులు అందజేశారు.

### ఓవరాల్ ఫెర్ఫార్మెన్స్‌లో ఉత్తమ గనులు ఇవే

| | | |
|---|---|---|
| **'ఏ' గ్రూపు ఓ.సీ. గనులు** | | |
| ప్రథమస్థానం | ఓసి - మేడిపల్లి | ఏరియా - రామగుండం-1 |
| ద్వితీయస్థానం | ఓసి - గౌతంఖని | కొత్తగూడెం |
| **'ఏ' గ్రూపు యూజీ గనులు** | | |
| ప్రథమస్థానం | జి.డి.కె.-5 | రామగుండం-1 |
| ద్వితీయస్థానం | ఆర్.కె.-7 | శ్రీరాంపూర్ |
| తృతీయస్థానం | వి.కె.-7 | కొత్తగూడెం |
| **'బి' గ్రూపు గనులు - ఓసీ గనులు** | | |
| ప్రథమస్థానం | బైరిగూడ ఓసి | బెల్లంపల్లి ఏరియా |
| ద్వితీయస్థానం | కోయగూడెం ఓసీ | ఇల్లందు |
| **'బి' గ్రూపు యూజీ గనులు** | | |
| ప్రథమస్థానం | ఐ.కె.-1ఎ | శ్రీరాంపూర్ |
| ద్వితీయస్థానం | కె.కె.-2 | మందమర్రి |
| తృతీయస్థానం | లాంగ్‌వాల్ | భూపాలపల్లి |

### ఉత్తమ బహుమతులు పొందిన విభాగాలు ఇవి

| | | | |
|---|---|---|---|
| 1. | ఏరియా స్టోర్స్‌లో | ప్రథమ | శ్రీరాంపూర్ |
| | | ద్వితీయ | మణుగూరు |
| 2. | స్టోర్స్‌లో | ప్రథమ | రామగుండం-2 (ఓసీపి స్టోర్స్-3) |
| | | ద్వితీయ | శ్రీరాంపూర్ స్టోర్స్ |
| 3. | సి.హెచ్.పీలలో | ప్రథమ | రుద్రంపూర్ సి.హెచ్.పి. |
| | | ద్వితీయ | ఓసి-1 సి.హెచ్.పి., రామగుండం-3 |
| 4. | పవర్‌హౌజస్ | ప్రథమ | బి.పవర్‌హేజ్ - కొత్తగూడెం |
| 5. | 132 కె.వి. స్టేషన్లు | ప్రథమ | మణుగూరు |
| 6. | ఎం.వి.టి.సి. | ప్రథమ | కొత్తగూడెం |
| 7. | రెస్క్యూ రూం | ప్రథమ | భూపాలపల్లి |
| 8. | రెస్క్యూ స్టేషన్ | ప్రథమ | రామగుండం |

ఇవికాక రెస్క్యూ సిబ్బందికి, అధికారులు 26 మందికి నగదు బహుమతులు అందజేశారు. వీరిలో అధికారులకు 10,000 రూపాయలు నగదు, ఇతరులకు 7,000 రూపాయలు నగదును ప్రోత్సాహకంగా అందజేశారు.





### ప్రమాదం ఎరుగని కార్మికులు (బహుమతి గ్రహీతలు)

| | పేరు | గని | ఏరియా |
|---|---|---|---|
| 1. | కర్రి కుమార్ | 5.బి. ఇంక్లైన్ | కొత్తగూడెం |
| 2. | బండారి సమ్మయ్య | 21.ఇంక్లైన్ | ఇల్లందు |
| 3. | జి. రామారావు | పి.కె.-1 | మణుగూరు |
| 4. | కోట రాజేషం | జి.డి.కె.-11ఎ | రామగుండం-1 |
| 5. | బుసబోయిన నంబయ్య | జి.డి.కె.-8ఎ | రామగుండం-2 |
| 6. | నారా శేషయ్య | జి.డి.కె.-10 | రామగుండం-3 |
| 7. | ఎరబాటి లింగారావు | కె.టి.కె.-5 | భూపాలపల్లి |
| 8. | గడ్డం నర్సాగౌడ్ | ఆర్.కె.-7 | శ్రీరాంపూర్ |
| 9. | పెరుమాళ్ల మల్లయ్య | ఆర్.కె.-1ఎ | మందమర్రి |
| 10. | నూనె రాజయ్య | గోలేటి-1 | బెల్లంపల్లి |

వీరికి మన ఛైర్మన్ అండ్ ఎం.డి. బహుమతులు అందజేశారు.





# బొగ్గునుంచి లిక్విడ్ పెట్రోలు తీయడానికి టాటా, జిందాల్ కంపెనీలు సన్నద్ధం

## రెండు పెద్ద బొగ్గు బ్లాకుల కేటాయింపుకు రంగం సిద్ధం

దేశంలో రోజురోజుకీ పెరుగుతున్న పెట్రోలియం అవసరాలను దృష్టిలో ఉంచుకొని బొగ్గునుంచి ఆయిల్ తీయడానికి ముందుకొచ్చే పరిశ్రమలను కేంద్రం ప్రోత్సహించాలని భావిస్తోంది. ఇటువంటి సి.టి.ఎల్ (కోల్ టు లిక్విడ్) ప్రాజెక్టుల కోసం ఇప్పటికే ధరఖాస్తు చేసుకొన్న కంపెనీలపై పూర్తిస్థాయి పరిశీలనను కేంద్ర ప్రభుత్వం ద్వారా ఏర్పాటైన ఐ.జి.ఎం. (ఇంటర్ మినిస్టీరియల్ గ్రూపు) చేపట్టింది. పరిశీలన తర్వాత అర్హులైన వారి పేర్లను కేంద్రానికి సిఫార్సు చేసిందని కేంద్ర బొగ్గు సహాయ మంత్రి శ్రీ బగ్రోడియా పార్లమెంటుకు (ఫిబ్రవరి 25న) నివేదించారు.

కోల్ ఇన్‌సైట్ పత్రిక కథనం ప్రకారం టాటా, సన్స్-ససోల్స్ జాయింట్ వెంచర్‌కు, అలాగే జిందాల్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్ (జె.ఎస్.పి.ఎల్.)కు అనుమతులు లభించే అవకాశాలున్నాయి. ఈ రెండు కంపెనీలు ఉత్పత్తులు ప్రారంభిస్తే రోజుకి 1,60,000 బ్యారెల్స్ ఆయిల్ ఉత్పత్తి అవుతుంది. దీనివలన పెట్రోలియం కోసం మన దేశం పెద్ద ఎత్తున వెచ్చించే విదేశీ మారకద్రవ్యంలో భారీ పొదుపు లభించడమే కాక తక్కువ  ధరకే ఇంధనం లభించే అవకాశాలున్నాయి. **జిందాల్ కంపెనీ కథనం ప్రకారం ఏడాదికి 30 మిలియన్ టన్నుల వాష్‌డ్ కోల్‌ను వాడి రోజుకి 80 వేల బ్యారల్స్ క్రూడ్ ఆయిల్ ఉత్పత్తి చేయనున్నారు. బొగ్గునుంచి ఆయిల్ తీయగా మిగిలిన వ్యర్థ పదార్థాలతో 1,530 మెగావాట్ల విద్యుత్తును కూడా ఉత్పత్తి చేయనున్నారు. దీనికోసం జిందాల్ కంపెనీ 42 వేల కోట్ల రూపాయలు గుమ్మరించనుంది. ఇక సాంకేతిక పరిజ్ఞానానికి వస్తే జర్మన్‌కు చెందిన 'లుర్గీ' భాగస్వామ్యంతో "ఇండైరెక్టు కోల్ లిక్విఫాక్షన్" పద్ధతి ద్వారా క్రూడ్ ఆయిల్ తీయనున్నారని తెలుస్తోంది.** ఫిబ్రవరి 27వ తేదీన కేంద్ర ప్రభుత్వం వారు జిందాల్ కంపెనీకి ఒరిస్సా రాష్ట్రంలోని రాంచంది ప్రమోషనల్ బ్లాకును కేటాయించిందనీ, అలాగే టాటా గ్రూపు జెవికి కూడా అదే రాష్ట్రంలో మరో బ్లాకును కేటాయించారని తెలుస్తోంది.

కోల్ టు లిక్విడ్ ప్రాజెక్టు కోసం వాస్తవానికి కేంద్రం ఒకే ఒక బ్లాకును ప్రయోగాత్మకంగా కేటాయించాలను కొన్నప్పటికీ రెండు బ్లాకులను రెండు పెద్ద కంపెనీలకు కేటాయించింది. మొత్తం మీద చూస్తే ఒరిస్సా రాష్ట్రంలో కేటాయించిన మూడు బొగ్గు బ్లాకుల్లో కలిపి సుమారు 6 బిలియన్ టన్నుల బొగ్గు నిల్వలున్నట్లు అంచనా! సి.టి.ఎల్. ప్రాజెక్టుల కోసం రాధికాపూర్, శ్రీరాంపూర్, రాంచండి బొగ్గు బ్లాకుల కోసం కేంద్రం దరఖాస్తులు ఆహ్వానించగా 22 ప్రభుత్వరంగ సంస్థలు, 6 ప్రైవేటు సంస్థలు దరఖాస్తు చేశాయి. కాగా నిర్ధారించిన ప్రాధాన్యతలు లేని దరఖాస్తులు తిరస్కరించగా చివరికి జిందాల్, టాటా గ్రూపు జె.వి.సి.లకు అదృష్టం దక్కింది.

**5 ఏళ్ళ తర్వాతే ఉత్పత్తి**

**బొగ్గు బ్లాకులు ఇప్పుడు కేటాయించినప్పటికీ వాస్తవ కోల్ టు ఆయిల్ ఉత్పత్తి బయటకు రావడానికి ఐదేళ్ల కాలం పడుతుందని అంచనా! ఏదేమైనాప్పటికీ భారత ఇంధన అవసరాలు తీర్చడానికి బొగ్గు ద్వారా మరో ప్రత్యామ్నాయానికి తెర తీయడం మన జాతి అవసరాల రీత్యా ఎంతో ప్రయోజనకరం.**

# కోలిండియాలో ఆక్షన్ ద్వారా విక్రయింయిన బొగ్గు 435 లక్షల టన్నులు

కోలిండియా 2008-09లో ఈ-ఆక్షన్ ద్వారా సుమారు 435 లక్షల టన్నుల బొగ్గును విక్రమించింది. (ఫిబ్రవరి వరకూ). దీనిద్వారా 60 శాతం పైగా బిడ్ ప్రైస్ కన్నా అదనంగా సంపాదించగలిగిందని కోల్ ఇన్‌సైట్ పేర్కొంది. మొత్తం 65,803 మంది బిడ్డర్లు ఈ-ఆక్షన్‌లో పాల్గొనగా వీరిలో 38,424 మంది 435 లక్షల టన్నుల బొగ్గును కైవశం చేసుకొన్నారు. కోలిండియా భాగస్వాముల్లో మహానది కోల్ ఫీల్డ్ అత్యధికంగా 171 లక్షల టన్నుల బొగ్గును ఈ-ఆక్షన్ ద్వారా విక్రయించింది. మిగిలిన వారిలో అమ్మకాల ప్రకారం వరుసగా ఎస్.ఇ.సి.ఎల్. (84 లక్షలు), సి.సి.ఎల్ (55 లక్షలు), డబ్ల్యు.సి.ఎల్. (50 లక్షలు), బి.సి.సి.ఎల్. 32 లక్షలు, ఎన్.సి.ఎల్. 20 లక్షలు, ఇ.సి.ఎల్. 18 లక్షలు, ఎన్.ఇ.సి. 4 లక్షల టన్నులు అమ్మాయి.

# మొజాంబిక్‌లో అడుగుపెట్టిన కోలిండియా

ద్వైపాక్షిక ఒప్పందాల్లో భాగంగా భారత్‌కు చెందిన కోలిండియా లిమిటెడ్ కంపెనీ మొజాంబిక్‌లో దాదాపు వెయ్యి మిలియన్ టన్నుల నిక్షేపాలు గల రెండు బ్లాకులను కైవశం చేసుకొంది. ఇది అక్కడి ప్రభుత్వ కేటాయింపు ద్వారానే జరిగింది. 30 సంవత్సరాల కోలిండియా చరిత్రలో ఇదో నూతనాధ్యాయం పై రెండు బ్లాకుల్లో గల బొగ్గు నిల్వల గురించి ఇంకా సమగ్ర అన్వేషణ చేయాల్సి ఉందనీ, అలాగే సమీపప్రాంతం వరకుగల రైలుమార్గాన్ని మరో 20 కిలోమీటర్లు కొనసాగించాల్సివుందనీ, కోలిండియాకు చెందిన డైరెక్టర్ టెక్నికల్ ఎస్.సి.ఝా కోల్ ఇన్‌సైట్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

# చైనాలో రక్షణలేని 4వేల చిన్నగనుల మూసివేతకు నిర్ణయం

చైనా ప్రపంచంలో అత్యంత ఎక్కువ స్థాయిలో బొగ్గు ఉత్పత్తి చేసే దేశం. అదే సమయంలో అత్యధికంగా ప్రమాదాలు జరిగే దేశం కూడా ఇదే! దీనికి కారణం చైనాలోగల చిన్న చిన్న బొగ్గు గనులు. వ్యక్తులు, సంస్థల చేతుల్లో గల ఈ గనుల్లో ఏటా వేలాదిమంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఒక్క 2007 సంవత్సరంలోనే ఇటువంటి గనుల్లో 3,770 మంది చనిపోయారు. వీరిలో 1084 మంది గనుల్లో జరిగిన పేలుళ్ల వల్లనే చనిపోయారు. దీనినిబట్టి అక్కడి గనుల్లో రక్షణ ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. కనుక చైనా ప్రభుత్వం హై రిస్కు గలిగి, విషవాయువులు వెదజల్లే గనులను మూసేస్తూ వస్తోంది. అలాగే 3 లక్షల టన్నుల లోపు ఉత్పత్తి సామర్థ్యంగల గనులను సైతం మూసేసింది. దీంతో ప్రమాదాల సంఖ్య 20 శాతం తగ్గింది. ప్రభుత్వము మరింత కఠినంగా వ్యవహరిస్తూ 4వేల చిన్న గనులను మూసివేయాలని నిర్ణయించింది.

# దేశంలో తీవ్రమైన బొగ్గు కొరత మాత్రం లేదు

దేశంలో బొగ్గుకోసం తీవ్రమైన కొరత మాత్రం లేదని, అయితే కొన్ని విద్యుత్ ఉత్పత్తి సంస్థలనుంచి వచ్చిన డిమాండ్ కారణంగా కొంత మొత్తంలో బొగ్గును దిగుమతి చేసుకోవల్సి వచ్చిందని "కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ సహాయ మంత్రి బగ్రోడియా పేర్కొన్నారు. ప్రణాళికా సంఘం వారి అంచనాల ప్రకారం 2008-09 నాటికి బొగ్గు డిమాండ్ 550 మిలియను టన్నులు ఉండగా 497.29 మిలియను టన్నుల బొగ్గు ఉత్పత్తి జరుగుతుందని అంచనా వేశారనీ, దీనివలన డిమాండ్‌కూ, ఉత్పత్తికీ మధ్య 52.71 మిలియను టన్నుల అంతరం ఏర్పడిందన్నారు. కనుక 2008-09లో ఆగస్టునాటికి 24.93 మిలియనుటన్నుల బొగ్గు విదేశాలనుంచి దిగుమతి చేసుకోవాల్సి వచ్చిందన్నారు. **అయితే విద్యుత్ సంస్థలకు బొగ్గు సరఫరా చేయడంలో కోలిండియా, సింగరేణి ముందన్నాయని పేర్కొన్నారు.**

# రక్షణను మరువకురా !

- శ్రీ జాకబ్, క్లర్క్, రామగుండం-1

సింగరేణి కల్పతరువురా
మనలగన్న కన్న తల్లిరా
కాపాడుకోవాలి తనువును - కార్మికా
రక్షించుకోవాలి తల్లిని
గనిలోన పనిలోన నిమగ్నమై మనముండగ
నిద్రలాముంచుకొచ్చి నిస్సత్తువ ఆవరించి
పరుగుపరుగునొస్తుందోయ్ ప్రాణాలను తీస్తుంది - కార్మికా
విదిలించి కొట్టరా - రక్షణను పాటించి... ॥సింగరేణి॥
పోకూడని దారువెంట రావాలని చూస్తుంది
మత్తుమందు రంగరించి మన ముఖాన పులుముతుంది
మూర్ఛణ్ణి చేస్తుంది మెడకు తాడు బిగిస్తుంది - కార్మికా
మెడపట్టి తరుమరా - రక్షణను పాటించి ॥సింగరేణి॥
అడుగడుగున అలుముకునే అజాగ్రత్త రాక్షసి
మన రక్తం పీల్చేందుకు అర్రులుచాస్తుంది
ఆవురావురంటుంది అరాచకం చేస్తుంది - కార్మికా
తొడచరిచి నిలువరా - రక్షణను పాటించి ॥సింగరేణి॥
మనమేని రక్షణమ్
సింగరేణి తల్లి రక్ష
సింగరేణి రక్షణమ్
దేశ రక్ష ధరణి రక్ష - కార్మికా
రక్షణ మరువకురా - శిక్షలను కోరకురా !

# మా అభిప్రాయం ఏమిటంటే ...

పూర్తిగా కార్మిక విజయగాథలతో రూపొందించిన స్ఫూర్తి సింగరేణీయుల సమాచారం ప్రత్యేక సంచిక చాలా చాలా బాగుంది. ఇదొక వినూత్నమైన ఆలోచన. ఇప్పుడు సింగరేణీయుల సమాచారం నిజమైన కార్మికుల పత్రికగా అనిపించింది. స్ఫూర్తిదాతల్లో కొందరికైనా కంపెనీవారు బహుమతులు అందించి గౌరవించాలని నా మనవి.

**- శ్రీ కిషోర్, క్లర్క్, హైదరాబాద్ ఆఫీస్.**

స్ఫూర్తి పత్రికను నేను నెట్‌లో చూశాను. ఇంతవరకు ఎప్పుడూ ఇటువంటి పత్రిక సింగరేణి చరిత్రలో రానేలేదు. సరిక్రొత్త ప్రయోగం చేసిన పి.ఆర్. శాఖకు అభినందనలు.

**- శ్రీ చలపతిరాజు, కొత్తగూడెం.**

స్ఫూర్తి పత్రిక అద్భుతంగా ఉంది. మన సంస్థలో ఇంతటి స్ఫూర్తిదాతలు ఉన్నారన్న విషయం తెలిసి మాకు ఎంతో సంతోషంగాను గర్వంగాను అనిపించింది. ముందుమాటలో ఛైర్మన్ గారు అన్నట్లు మనం ఎక్కడోనుంచో కాక మన సింగరేణియులనుంచి కూడా స్ఫూర్తి పొందవచ్చు.

**- శ్రీ రామచందర్, కొత్తగూడెం.**

స్ఫూర్తి పత్రికలో ఇచ్చిన ప్రతీ కథనం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం. పుస్తకంలో ప్రచురింపబడిన స్ఫూర్తిదాతలందరికీ అభినందనలు. ఇంతచక్కని పుస్తకం ఆకర్షణీయమైన రంగుల్లో అనువైన సైజులో ప్రచురించినందుకు అభినందనలు.

**- శ్రీ ఎం.పి. ప్రభాకరరావు, క్లర్క్,**

స్ఫూర్తి పత్రిక ప్రతి కార్మికుడు చదువతగింది. ఇటువంటి పత్రికలు ఎక్కువ కాపీలను ప్రచురిస్తే బాగుంటుంది.

**- శ్రీ మధు, జనరల్ మజ్దూర్, మణుగూరు.**

**మన టీ.వీ. కార్యక్రమాలపై ...**

5.4.2009న మన టి.వీ.లో ప్రసారమైన 'అయ్యో ఎంతపనిచేసాను' (విజయం మనదే) సీరియల్ ఎపిసోడ్ నాకెంతో నచ్చింది. సేఫ్టీ లేకపోతే ఎంత అనర్థం జరుగుతుందో చక్కగా చూపించారు.

**- శ్రీ పి.కొమరయ్య, కేబల్‌బాయ్, ఓ.సి.పి.-2, రామగుండం.**

మన టీ.వీ.లో సింగరేణి రౌండప్ ద్వారా అందిస్తున్న వార్తావిశేషాలు మమ్మల్ని ఆకట్టుకుంటున్నాయి. కార్మికుల పిల్లలకు, సమీప గ్రామాల పిల్లలకు సంస్థ స్కాలర్‌షిప్‌లు అందిస్తున్న విషయం తెలిసి ఎంతో సంతోషిస్తున్నాం.

**- శ్రీ డి.తిరుపతిరావు, ఇ.పి.ఆపరేటర్, రామగుండం-3.**

22.3.2009న మన టీ.వీ.లో మెడిసిటి డాక్టర్ రాజశేఖర్‌రెడ్డిగారు గుండె జబ్బులపై ఇచ్చిన సలహాలు చాలా బాగున్నాయి. ప్రతీ వారం డాక్టర్ సలహాలు ప్రసారం చేయగలరు.

**- శ్రీ ఒ.ఉపేందర్, ఓ.సి.-2, రామగుండం.**

'విజయం మనదే' సీరియల్‌లో 'ఒట్టు ఇకపై ముట్టను' ఎపిసోడ్ మమ్మల్ని ఎంతగానో కదిలించింది. తాగుడు అలవాటు ఉన్న తండ్రిని అతని కుమారుడు ఎలా మార్చాడన్న విషయం చక్కగా చూపారు. నటులకు, దర్శకులకు అభినందనలు.

**- శ్రీ శ్రీనివాస్, లక్ష్మి, బండారుగూడెం.**

**జయహో సింగరేణి ఆడియో పాటలపై...**

జయహో సింగరేణి పేరుతో మన సింగరేణి కళాకారులు రచించి, గానం చేసిన పాటలు చాలా బాగున్నాయి. పాత పాటలశైలికి భిన్నంగా కొత్తదనంతో కూడుకొనివున్నాయి. మన కార్మికుల్లో మంచి ప్రతిభావంతులైన కళాకారులున్నారని ఈ కేసెట్ నిరూపిస్తుంది. వీటిలో గల కొన్ని పాటలకు వీడియో చిత్రీకరణచేసి మన టీ.వీ.లో ప్రసారంచేస్తే బాగుంటుంది.

**- శ్రీ జయప్రకాష్, పి.ఎమ్., మణుగూరు.**

జయహో సింగరేణి పాటలలో అన్నీ ఆకట్టుకొనేవిధంగా, సందేశాత్మకంగా ఉన్నాయి. ముఖ్యంగా టైటిల్ సాంగ్ 'జయము జయము' పొదుపుపై ఇచ్చిన 'పైసలపదిలంరా' ఉద్యోగస్తులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. ఈ కేసెట్‌లు కావాలంటూ ఉద్యోగులు కోరుతున్నారు. కొందరు వీటి కాపీలను తీసుకుంటున్నారు కూడా! రచయితలకు, గాయకులకు అభినందనలు తెలుపుతున్నారు.

**- శ్రీ కె.వి.రమణ, పి.ఆర్.ఎ., కొత్తగూడెం.**


# సిరుల అలివేణి సింగరేణి

పల్లవి : సిరిసంపదల వేణి ఝురుల ఝుంఝురుల ద్రోణి
తెలంగాణ వాణి సిరుల అలివేణి సింగరేణి ॥సిరి॥
చ॥1 సీతారాముల సన్నిధిలో, రాణీ రుద్రమ పెన్నిధిలో
కార్మిక సోదర స్వేదంతో, ఆవని గర్భమే ప్రసవించింది.
చ॥2 బొగ్గు గుట్టగా పుట్టింది, కొత్తగూడెమై మెట్టింది
బెల్లంపల్లిని మెచ్చింది, గోదావరిలోయగ ప్రవహించింది ॥సిరి॥
చ॥3 ఉత్పత్తే ఒక లక్ష్యంగా, శ్రమైక జీవుల దేవతగా
కోట్ల ప్రజలకు మాతృమూర్తిగా, కాంతిపుంజమై వెలిగింది.
చ॥4 జ్వలితై వెలుగులు చిమ్మింది, విద్యుల్లతగా మెరిసింది
యంత్రశక్తిగా, మంత్రశక్తిగా పుడమే ఒకటై పులకించింది॥సిరి॥


రచన: శ్రీ ఐ.ఆర్.కె.రావు,
చీఫ్ జనరల్ మేనేజర్ (విజిలెన్స్)








కీ॥శే॥ గౌరవనీయులు శ్రీ పి.వి. నర్సింహారావు మన దేశ ప్రధానమంత్రిగా పనిచేసిన విషయం మీకు తెలుసు. ఆయన అంతకు ముందు మన రాష్ట్ర ముఖ్యమంత్రిగా కూడా పని చేశారు. ఈ కాలంలో ఆయన రామగుండం ఏరియాలో 1972 జూన్ 16వ తేదీన రెండు గనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా తీసిన ఫోటోలు ఇవి. ఈ చిత్రాలలో నాటి కేంద్ర జలవిద్యుచ్ఛక్తి శాఖామంత్రి డా.కె.ఎల్.రావు (నల్లకళ్లజోడు ధరించినవారు), మన ఛైర్మన్ శ్రీ కె.ఇ.విద్యాసాగర్‌లను కూడా చూడవచ్చు.





మన మెయిన్ ఆసుపత్రికి అనుబంధంగా 1959 అక్టోబర్ 22వ తేదీన ఒక నర్సింగ్ స్కూలును మన యాజమాన్యం ప్రారంభించింది. ఈ పాఠశాలకు రాష్ట్ర ప్రభుత్వం వారి గుర్తింపు కూడా ఆనాడే లభించింది. ఈ ఏడాదికి ఈ స్కూలు 50 ఏళ్లు పూర్తి చేసుకొని, మే 11న స్వర్ణోత్సవ వేడుకలు జరుపుకొంది. ఈ పాఠశాల ప్రారంభంనాటి చిత్రాలను పాత జ్ఞాపకాలుగా అందిస్తున్నాం.






నాడు మన కార్మికులు క్రీడలు, కళలపట్ల ఎంతో ఆసక్తి కలిగి ఉండేవారు. కొత్తగూడెంలో 1960 ప్రాంతంలో జరిగిన క్రీడోత్సవాలలో పౌరాణిక నాటకం ప్రదర్శిస్తున్న మన కళాకారులను, పౌరసంబంధాలశాఖ వారి స్టాలును ఆసక్తిగా చూస్తున్న కార్మికుల్ని పై చిత్రాలలో చూడవచ్చు.

# వార్తా చిత్రాలు



కొత్తగూడెం మహిళా కళాశాలలో సుమారు 97 లక్షలతో నిర్మించిన వసతి గృహాన్ని 27.01.2009న ప్రారంభిస్తున్న మన ఛైర్మన్ & ఎం.డి.




నర్సింగ్ స్కూల్ స్వర్ణోత్సవాల సందర్భంగా మే 11, 2008న సావనీర్ విడుదల చేస్తున్న ఛైర్మన్ & ఎం.డి., డైరెక్టర్లు.



మణుగూరు ఏరియాలో ప్రాజెక్టు ప్రభావిత కొండాపురం గ్రామ గిరిజనులకు కంపెనీ ఆసుపత్రులలో వైద్యం కోసం గుర్తింపు పుస్తకాలను అందింపచేస్తున్న శ్రీ జె.వి.దత్తాత్రేయులు, డైరెక్టర్ (ఆపరేషన్స్)




రామగుండం-2 సింగరేణీయులు విరాళంగా ఇచ్చిన రూ.59, 925/-ల చెక్కును డైరెక్టర్ (పి.& పి.) శ్రీ డి.ఎల్.ఆర్.ప్రసాద్ ద్వారా సైనిక సహాయ నిధికి అందచేస్తున్న దృశ్యం.



సింగరేణి పాఠశాలల్లో విద్యాప్రమాణాల పెంపుదలకు చొరవ చూపడంలో భాగంగా రామగుండం సెక్టర్ 3 హైస్కూల్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడుతున్న డైరెక్టర్ (పా) శ్రీ ఎల్.శశిధర్, ఐ.ఎ.ఎస్.




అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న సి.జి.ఎం. (పర్సనల్) శ్రీ ఎం.గంగిరెడ్డి.



ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొట్టాలంటూ రామగుండం-3లో నిర్వహించిన ర్యాలీలో ఒక దృశ్యం.



శ్రీరాంపూర్‌లోని సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో కొత్తగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌లో విద్యార్థులు.

# ప్రగతి పథంలో కొన్ని కార్యక్రమాలు

ప్రగతిపథంలో ముందుకెళ్తున్న మన సింగరేణిలో ఈ ఏడాది కొన్ని కొత్త గనులతో పాటు బొగ్గు రవాణా వ్యవస్థ ఆధునీకరణ పనులను ప్రారంభించుకొన్నాం. ఈ కార్యక్రమాల్లో మన ఛైర్మన్ అండ్ ఎం.డి. శ్రీ ఎస్.నర్సింగ్‌రావుతో పాటు మన డైరెక్టర్లు, ఏరియా అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



**భూపాలపల్లి ఏరియాలో కె.టి.కె. ఓపెన్‌కాస్ట్ గని ప్రారంభం (06.05.2009)**

ఈ గనినుంచి ఉత్పత్తి అయ్యే బొగ్గును రాష్ట్ర విద్యుత్ సంస్థ నిర్మించే పవర్‌హౌజ్‌కు సరఫరా చేయనున్నాము.



**ఇల్లందు ఏరియాలో కోయగూడెం ఓపెన్‌కాస్ట్ -2 ప్రారంభం**

ఈ గని ద్వారా ఏటా 23 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి అవుతుంది. ఈ బొగ్గు ప్రధానంగా కె.టి.పి.ఎస్., పాల్వంచకు సరఫరా అవుతుంది.



**ఆర్.కె. న్యూటెక్ గనికి మూడవ సొరంగమార్గం**

దీనివలన ఉత్పత్తి, ఉత్పాదకత పెరగటమే కాక ఉత్పత్తి వ్యయం కూడా తగ్గుతుంది. 21.02.09న జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న కార్మికులు







**రామగుండం -1, 2లో ఇంజన్ ఆన్ లోడ్ డిస్పాచ్ సిస్టమ్‌ల ప్రారంభం**

ఈ కొత్త సౌకర్యములో అదనపు ఖర్చులు తగ్గించడానికి బొగ్గులోడింగ్ వేగంగా, ఖచ్చితంగా జరగడానికి ఎంతగానో ఉపకరిస్తాయి.

Printed & Published by : Sri S. Chandra Sekhar, C.P.R.O. on behalf of Singareni Collieries Company Ltd.
Singareni Bhavan, PB No. 18, Red Hills, Hyderabad-500 004. A.P. Printed at : Sairam Printers, Hyderabad. Tel : 23232316